RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 74 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, సెప్టెంబర్,6,2025 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 74 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, September,6, 2025 | PAGES : 8 RS : 4 /-




అక్కడ పెట్టింది చాలు..

## అమెరికాకు ఎంతిస్తారు?

**టెక్ దిగ్గజాలకు ట్రంప్ సూటి ప్రశ్న**

వాషింగ్టన్: అమెరికాలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థల అధిపతులు, సీఈవోలకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. వైట్‌హౌస్‌లో ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఈవెంట్ అనంతరం ఈ డిన్నర్ ఏర్పాటు చేశారు. దీనికి టిమ్‌కుక్, సుందర్ పిచాయ్, జుకర్‌బర్గ్, సత్యనాదెళ్ల వంటి పలువురు టెక్ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలో పెట్టుబడుల గురించి ట్రంప్ వారిని సూటిగా ప్రశ్నించారు.



**హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు**

నేడు, రేపు గణేశ్ మహా

## నిమజ్జనం

- ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ వైపు వెళ్లే ప్రధాన మార్గాలు మూసివేత
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల రాకపోకలకు పోలీసుల ఏర్పాట్లు
- నగరంలోకి లారీల ప్రవేశంపై దాదాపు రెండు రోజుల పాటు నిషేధం
- ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, హెల్ప్‌లైన్ నంబర్ల ఏర్పాటు

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** నవరాత్రుల పాటు అంగరంగ వైభవంగా పూజలందు కున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరే సమయం ఆసన్నమైంది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు ఘట్టమైన గణేశ్ విగ్రహాల నిమజ్జ నం సందర్భంగా హైదరాబాద్ మహానగరంలో పోలీసులు సెప్టెంబరు 6, 7 తేదీల్లో భారీ ట్రాఫిక్ ఆంక్షలను ప్రకటించారు. దాదాపు 28 గంటల పాటు నగరంలోని కీలక మార్గాలలో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సాఫీగా సాగేందుకు, అదే సమయంలో సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ యంత్రాంగం వెల్లడించింది. ఈ సమయంలో నగరవాసులు పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దేశ ప్రగతికి డబుల్ డోస్

## జీఎస్‌టీ 2.0!

**ప్రధాని నరేంద్ర మోడీ**

న్యూఢిల్లీ : దేశ ప్రగతికి, అభివృద్ధికి జీఎస్‌టి 2.0 డబుల్ డోస్ వంటిదని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దంలో భారతదేశ పురోగతికి మద్దతుగా తదుపరి తరం సంస్కరణలను తీసుకువచ్చామన్నారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్‌టి సంస్కరణల ద్వారా భారతదేశ చురుకైన ఆర్థిక వ్యవస్థకు ఐదుకొత్త పంచరత్నాలను జతచేసినట్లు చెప్పారు. జీఎస్‌టి మరింత సులభమైందన్నారు. నవరాత్రి మొదటి రోజు ఈ నెల 22 నుండి కొత్తరేట్లు అమల్లోకి వస్తాయన్నారు. సకాలంలో తీసుకో వాల్సిన చర్యలు, మార్పులు చేపట్టకపోతే, మనం ఈనాటి అంతర్జా తీయ పరిస్థితుల్లో మన దేశానికి సరైనదిశా నిర్దేశాన్ని చేయలేమని మోడీ పేర్కొన్నారు. భారత్‌ను స్వయం స్వావలంబనగా తీర్చిదిద్దాల ంటే కొత్త తరం సంస్కరణలు చేపట్టక తప్పదని,ఇవి అత్యంత కీలకమని స్వాతంత్ర్య దినోత్సవం నాడు చెప్పామని, దీపావళి, ఛాత్‌పూజలకు ముందుగానే ఈసారిడబుల్ ధమాకా అందుతుందని దేశ ప్రజలకు హామీ ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రోజువారీ అవసరమైన వస్తువులపై కూడా భారీగా పన్నులు పడేవన్నారు. సామాన్యుడికి సంతోషం కలిగేలా ఆ సమస్యలను పరిష్కరించేం దుకు తమ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పుకున్నారు.




అనిల్ అంబానీకి మరో

## షాక్

**సీబీఐ కేసు నమోదు**

న్యూఢిల్లీ :ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. ఆయనపై కేంద్ర దర్యాప్తు సంస్థ కేసు నమోదు చేసింది. రూ.2,929.05 కోట్ల రుణ మోసం కేసులో అనిల్ అంబానీపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ చర్యలు చేపట్టింది. ముంబైలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), దాని డైరెక్టర్ అనిల్ అంబానీ, ఇతరులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. మనీ లాండరింగ్ ఆరోపణలతో సంబంధమున్న రూ.2,000 కోట్ల మోసపూరిత ఎస్బీఐ రుణం కేసులో అనిల్ అంబానీకి చెందిన సంస్థలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఇటీవలే సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనిల్ అంబానీని ఇప్పటికే ఫ్రాడ్‌గా గుర్తించిన విషయం తెలిసిందే. రిలయన్స్ కమ్యూనికేషన్స్, దాని అనుబంధ సంస్థలు ఎస్బీఐసహా ఆయా బ్యాంకుల నుంచి మొత్తం రూ.31,580 కోట్ల రుణాన్ని తీసుకున్నట్టు తాజా ఫైలింగ్‌నుబట్టి తెలుస్తున్నది. అయితే ఈ నిధులను దుర్వినియోగపర్చినట్టు తాము గుర్తించామని ఆర్‌కామ్‌కు పంపిన లేఖలో ఎస్బీఐ స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌కామ్ నడుచుకున్నట్టు పేర్కొన్న బ్యాంక్.. దీన్నో మోసపూరిత రుణంగా వర్గీకరించాలని తమ ఫ్రాడ్ ఐడెంటిఫికేషన్ కమిటీ తీర్మానించినట్టు తేల్చిచెప్పింది.




గాజాపై ఆగని ఇజ్రాయెల్

## దాడులు..

**64 వేలు దాటిన మృతులు**

గాజా: హమాస్, ఇజ్రాయెల్ దాడులు రెండేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. హమాస్ తుదముట్టించే వరకు గాజాపై దాడులు చేస్తామంటూ ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దీంతో గాజా స్ట్రిప్‌లో ఇప్పటివరకు 64 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మృతిచెందారు. 2023, అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని హమాస్ దాడికి పాల్పడింది. దీంతో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. మరో 251 మందిని బందీలుగా హమాస్ పట్టుకెళ్లింది. ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతున్నది. దీంతో ఉగ్రవాదులు ఎంతమంది చనిపోయారో తెలియనప్పటికీ, మహిళలు, చిన్నారులు, సాధారణ పౌరులు మాత్రం నెతన్యాహూ సైన్యానికి బలవుతూనే ఉన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 64,231 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మరో 400 మందికిపైగా ఆచూకీలేకుండా పోయారని తెలిపింది. మృతుల్లో సగానికిపైగా మహిళలు, చిన్నారులు ఉన్నారని పేర్కొంది. తాజాగా నిరాశ్రయులైన వారిపై ఇజ్రాయెల్ దాడికి పాల్పడిందని, దీంతో 25 మంది మరణించారని గాజా సిటీలోని షిఫా హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. వారిలో తొమ్మిదిమంది చిన్నారులు, ఆరుగురు మహిళలు ఉన్నారని తెలిపారు.



మరింత చౌకగా పెట్రోల్...

మాస్కో: అట్లాంటిక్ బేసిన్ నుంచి తీసే.. బ్రెంట్ చమురుతో పోలిస్తే దాదాపు 5 డాలర్లు చౌకగా రష్యా చమురు అమ్ముతోంది. దీంతో.. ట్రంప్ బెదిరింపులను పట్టించుకోకుండా.. మనదేశం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తోంది. 2019-2020 ఆర్థిక సంవత్సరంలో భారత్ ముడిచమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 1.7 శాతం ఉండగా.. 2024-25 సంవత్సరంలో ఏకంగా 35.1శాతానికి ఎగబాకింది.

పరిమా ణం పరంగా చూస్తే.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 245 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) ముడిచమురును దిగుమతి చేసుకోగా ఇందు లో 88 ఎంఎంటీ ముడిచము రు ఒక్క రష్యా నుంచే రావడం గమ నార్హం. అమెరికా ఒత్తిళ్ల మధ్య కూడా భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. జులైలో దాదాపు 32 వేల కోట్ల మేర విలువైన చమురును భారత్ రష్యా నుంచి కొనుగోలు చేసింది. ఇంధన అవసరాల కోసం భారత్ 85 శాతం మేర దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ సహా దాదాపు 40 దేశాల నుంచి ముడిచమురును సమకూర్చుకుంటోంది. గయానా, బ్రెజిల్, కెనడా వంటి దేశాలు కొత్తగా చేరడంతో భారత్ ఇంధన భద్రత మరింత మెరుగుపడింది. రష్యా ఆయిల్ లేకున్నా భారత్ ఇతర దేశాలతో ఉన్న సంబంధాలతో తన డిమాండ్‌కు సరిపడా ముడిచమురును సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగితే దేశ దిగుమతుల వ్యయాలు పెరగడానికి ఆస్కారం ఉంటుంది. కానీ, ట్రంప్ సుంకాలతో.. ఈ సెప్టెంబర్ నుంచి రష్యా నుంచి మరింత చమురు దిగుమతి చేసుకోవాలని, భారత్ భావిస్తోంది. సుమారు మూడు లక్షల బ్యారెల్స్ చమురును రష్యా నుంచి అదనంగా కొనుగోలు చేయాలని భారత్ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. అంతేకాక, రష్యా ఒక బ్యారెల్‌పై 2 నుంచి 3 డాలర్ల డిస్కౌంట్ కూడా ఇవ్వటంతో.. భారత్‌కు ఈ కొనుగోళ్లు మరింత లాభదాయకంగా మారనున్నాయి.



నిస్సహాయ స్థితిలో..

## అపరచాణక్యుడు

- కెసిఆర్ కుటుంబాన్నీ కంట్రోల్ చేయలేక పోవడానికి కారణాలేంటి..?
- కెసిఆర్ లో నాటి చాణక్యం ఏమయింది..?

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** కేసీఆర్ అంటే అపరచాణక్యుడు. ఆయన మాట అంటే శాసనం. ఇలాంటి పరిస్థితుల్ని తెలంగాణ చూసింది. ప్రగతి భవన్ నుంచి బయటకు రాకుండా కను సైగలతోనే పాలనను శాసించారు. అలాంటి నాయకుడు ఇప్పుడు నిస్సహాయంగా కనిపిస్తున్నా రు. సొంత కుటుంబసభ్యులనూ సముదాయించలేకపోతు న్నారు. రాజకీయం తన చేతుల్లో నుంచి జారిపోతున్నా.. నిస్సహాయంగా ఉండిపోతున్నారు. ఏ నిర్ణయం తీసుకో లేకపోతున్నారు. జరిగేదేదో జరుగుతుందని వదిలేసినా పరిస్థితులు కనిపిస్తున్నాయి. కవిత లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లారు. ఆ స్కాం నిజంగా చేశారా లేదా అన్న దాన్ని పక్కన పెడితే కేసీఆర్ ఈ అంశంపై మరింత ఎక్కువగా దృష్టి పెట్టాల్సి ఉంది. కానీ పెట్టలేకపోయారు. కవితను జైలుకెళ్లి పరామర్శించలేకపోయారు. తనకు చెడ్డపేరు వస్తుందని.. ఆయన అనుకున్నారేమో కానీ ఎప్పుడూ అలాంటి ప్రయత్నాలు చేయలేదు. అదే సమయంలో రాజకీయాల విషయంలో కవితకు సర్ది చెప్పలేకపోయారు. ఆమెకు పార్టీలో ఎలాంటి పాత్ర ఉంటుందో చెప్పి.. అంత వరకూ పరిమితమవ్వాలని సూచించలేకపోయారు. జాతీయ రాజకీయాలు చేసినప్పుడు కవిత.. కేసీఆర్ వెంటే ఉండేవారు. జాతీయ రాజకీయాలు ఫెయిలయ్యాక.. కవితను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కేటీఆర్ కు ప్రాధాన్యం ఇచ్చారు. అక్కడే సమస్య వచ్చింది. సమస్య ఉందని తెలిసినా కేసీఆర్ .. కవితకు సర్ది చెప్పలేకపోయారు.

**నిజంగానే ఇతరుల చేతుల్లో బందీగా ఉన్నారా ?:** మీ చుట్టూ ఉన్న వాళ్ల గురించి .. వాళ్లు చేస్తున్న పనుల గురించి తెలుసుకోండి నాన్నా అని కవిత దీనంగా ప్రెస్ మీట్‌లో విజ్ఞప్తి చేసుకున్నారు. ఆమె మాటల ప్రకారం కేసీఆర్ ఇప్పుడు కొంత మంది చేతుల్లో బందీలుగా ఉన్నారు. ముఖ్యనేతలు అంటూ ఆయన చుట్టూ ఉండే కొంత మంది మాత్రమే రాజకీయం చేస్తున్నారు. కవిత ఇష్యూ జరుగుతున్నప్పుడు కూడా కేసీఆర్ ముఖ్యనేతలతో చర్చలు అంటూ మీడియా బ్రేకింకులు వచ్చాయి. రెండు, మూడు రోజుల నుంచి అవే బ్రేకింగులు. అంటే.. వీరందరి కోటరీలో కేసీఆర్ బందీ అయ్యాడని అర్థం చేసుకోవచ్చు.

# ఆర్థిక క్రమశిక్షణతో బంగారు భవిష్యత్తు

## - ఎమ్మెల్యే వివేకానంద్






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ)** :ఆర్థిక క్రమశిక్షణ ఉన్నప్పుడే బంగారు భవిష్యత్తు సాధ్యమని బిఆర్ఎస్ ఎల్ పి విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శుక్రవారం ఐడిపిఎల్ లోని ఎల్ఎస్ ఫంక్షన్ హాల్ లో హెచ్ఎంటి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖర్చు అయిన తర్వాత మిగిలిన డబ్బును సేవింగ్ గా చూస్తున్నామని, నేటి యువత తమ ఆలోచన ధోరణిని మార్చుకొని ముందుగా సేవింగ్స్ కు ప్రాధాన్యత నిచ్చి ఆ తర్వాతే ఖర్చు చేస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. మంచి ఆలోచనతో అనుభవం, నిబద్ధత, నిజాయితీ గల ప్యానెల్ హెచ్ఎంటి ఎంప్లాయిస్ ఉద్యోగుల అభివృద్ధి కోసం పని చేస్తున్న సంఘ సభ్యులను అభినందించారు. ప్రతి ఒక్కరి సొంతింటి కలను నెరవేర్చాలనే ఆలోచనతో హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసి ఉద్యోగుల అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఈ ప్యానెల్ ను ఉద్యోగులందరూ ఎన్నుకోవాలని సూచించారు.

హెచ్ బిఎస్ ప్యానెల్ కు నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జీఎం రాజేందర్, హెచ్ బిఎస్ డైరెక్టర్లు పండరి, సత్యనారాయణ, తులసీదాస్, అనంతరాములు, శ్రీశైలం, కళావతి, దివ్య జ్యోతి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీశైలం, మాజీ ఆఫీస్ బేరర్స్ మాధవా చారి, బల్వంత్ రెడ్డి, వెంకన్న, సంఘం నాయకులు దేవేందర్, మధు కృష్ణ, కో - ఆప్షన్ సభ్యులు మురళీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టించిన చోటే నిమజ్జనం

## - ఆదర్శంగా నిలిచిన భజన్ మందిర్





**కుషాయిగూడ, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ) :** గణనాధుని ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేశారు. కుషాయిగూడ భజన్ మందిర్ ఆధ్వర్యంలో 79వ సంవత్సర వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. మట్టి గణపతిని ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేసి ఆదర్శంగా నిలిచారు. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గణనాధుని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సాయంత్రం నిమజ్జనాన్ని వేద పండితుల చేత వినాయకుడికి మహా హారతులు నిర్వహించి అనంతరం పంచామృతాలచే అభిషేకాలు, ఐదు రకాల పూలాభిషేకలు నిర్వహించారు. స్థానికులచే మంగళ హారతులు పసుపు, అభిషేకాలు నిర్వహించారు. భజన్ మందిర్ గణనాయకుడిని నిమజ్జనం చేసారు. తదనంతరం భజన్ మందిర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు పండాల శివకుమార్ గౌడ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ ల ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్నను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల ఐక్యత పెరుగుతుంది

## - బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



**చర్లపల్లి, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ)** :ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల ఐక్యత పెరుగుతుందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ సోనియా గాంధీ నగర్ ఫేస్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొనడం అభినందనీయమని అన్నారు. భావి తరాలకు మన సంస్కృతి సంప్రదాయాన్ని అందించడమే కాకుండా మనలోని ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఇస్లావత్ హరినాయక్, అసోసియేషన్ అధ్యక్షులు శ్యామల బిక్షపతి, సభ్యులు పారుపల్లి శ్రీనివాస్ రెడ్డి, పలుగుల గోపాల్, కోశాధికారి చింతల వెంకటేశ్వర్లు, కోశాధికారి మోడం రాజు, సంయుక్త కార్యదర్శి కలమంట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు మైలారం బాల నర్సింహ, ఉంగరాల మహేందర్, కిట్టు యాదవ్, కొండ సత్యనారాయణ గౌడ్, మహేందర్, వెల్డింగ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సాయి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ గణపతి నవరాత్రి ఉత్సవాలు





**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ) :** ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ లోని శ్రీ సాయి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, బొజ్జ రాఘవ రెడ్డి, ఏఎస్ రావునగర్ డివిజన్ ప్రెసిడెంట్ కేశెట్టి ప్రసాద్, కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, అజీజ్, భద్రగామ నర్సింహా, భవాని, సునీత, మాధవి, లక్ష్మి పద్మ, బిజెపి నాయకుడు రోహిన్, సంపత్ రావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నాయకులు శరత్, అరవింద్ రెడ్డి, ప్రవీణ్, ప్రసాద్, ముదిగొండ లింగస్వామి, యుగంధర్, బండి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో మానసిక ప్రశాంతత


## - పట్నం మహేందర్ రెడ్డి






**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ) :** యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్ పేట్ మండలం అలంకృత రిసార్ట్ లో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బోధి స్కూల్ ఆఫ్ యోగ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అవార్డుల పంపిణీ కరెక్ట్ వానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది యోగ ప్రతిభావంతులకు అవార్డులు అందజేశారు. మిస్ ఇండియా రష్మిక, ఆధ్యాత్మిక వేత్త గౌరీ రొక్కం, సత్యవాణి, బోధి యోగ స్కూల్ ఫౌండర్ అశోక్, సలహాదారు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్రెడ్డి మాట్లాడుతూ అను నిత్యం బిజీగా ఉండే జీవితంలో ప్రశాంతత, ఏకాగ్రత, ఆరోగ్యం కోసం యోగ ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులు, యువత మొదలుకొని ఉద్యోగస్తులు, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి వరకు యోగ కొనసాగిస్తూ ఉన్నతులు అవుతున్నారని అన్నారు. యోగ ప్రాచీన భారత సంస్కృతి, సంప్రదాయంలో ఒక భాగమన్నారు. ఇటీవల భారతదేశ ప్రధాని మోడీ యోగా ప్రాధాన్యతను ప్రపంచానికి చాటారని గుర్తు చేశారు. అవార్డు గ్రహీతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శిక్షకులు యోగాను మరింత విస్తృతంగా కులమతాలకు, ప్రాంతాలకు, అతీతంగా ప్రచారం చేసి మానవాళికి మేలు చేయాలన్నారు.

# ఫ్యాబ్రికేషన్ కార్మికునికి రావలసిన వేతనం అందజేత




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి ఇండస్ట్రీ ఏరియాలో "ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్" లో ఓనర్ రవి దగ్గర సన్నీ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేసేవారు... కొన్ని అనివార్య కారణాలవల్ల వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయటంతో ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేశాడు. మొత్తం గత సంవత్సరం ఆగస్టు నెలలో కార్మికుడు సన్నీకి రావాల్సిన వేతనం రూ. 27 వేలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ రవిని ఎంత అడిగితే నిర్లక్ష్యం వహించాడు. దీంతో సన్నీ బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిని సంప్రదించాడు. కార్మిక నాయకుడు రవి ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ ఓనర్ రవితో పలుమార్లు చర్చించి కార్మికుడికి మొత్తం రావాల్సిన వేతనం ఇప్పించారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శుభోదయ కాలనీలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు






**చర్లపల్లి, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి డివిజన్ శుభోదయ కాలనీ ఫేస్ -3 లో కమిటీ వినాయకునికి ఘనంగా నవరాత్రి పూజలు నిర్వహించారు. గణపతి మహా ప్రసాద మొదటి లడ్డు పదకొండున్నర కిలోల లడ్డును వేలం పాటలో పోటా పోటీగా పాల్గొని మణిశ్రీ ఇంజనీరింగ్ అమనగంటి శ్రీనివాస్ సతీమణి కవిత రూ. 3,00,116 దక్కించుకున్నారు. రెండవ లడ్డు తొమ్మిదిన్నర కిలోల లడ్డు కూడా వేలం పాటలో హోరా హోరీగా పోటీ పడి వానపల్లి విశ్వప్రసాద్ సతీమణి ప్రియా 1,19,116 దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తిగుళ్ల రాంచందర్, ఉపాధ్యక్షులు సిద్దు శ్రీరినివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బలగం మల్లేష్, కోశాధికారి కృష్ణ, బాలరాజ్, కార్యదర్శులు శ్రీకాంత్, బాను నేత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నేత బొజ్జ రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు





**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొజ్జ రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానికులు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి రాజకీయ, సామాజిక సేవలను పలువురు గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా ఆయనను వర్ణించారు. ఆయన ప్రజా జీవన విధానం నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయమని హాజరైన నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కరిపే ప్రవీణ్ వంజరి, పెంచాల సురేందర్ రావు, పాకాల రాజు, నీరుగొండ సతీష్ బాబు, పత్తి కుమార్, పాత కోటి రామలింగం, సింగం కిరణ్, బేతాళ బాల్‌రాజ్, వెంకట్ రెడ్డి, పెంటయ్య, దత్తు, పెద్ది నవీన్ కుమార్, రామాచారీ, సుధాకర్, సహదేవ్, మధుచారి, ఆంజనేయులు, సందీప్ తదితరులు హాజరై రాఘవరెడ్డిని అభినందించారు. స్థానిక కాలనీ వాసులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి, రాఘవరెడ్డిని ఘనంగా సన్మానించారు.

# బతుకమ్మ పండుగకు "ఇందిరమ్మ చీరలు"

## - తెలంగాణ ఆడపడుచులకు శుభవార్త

## - మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ) :** తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి మహిళా లబ్ధిదారికి రెండు చీరలు ఉచితంగా ఇవ్వనున్నట్లు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తెలిపారు. ఇందుకోసం సిరిసిల్లచేనేత కార్మికుల చేత రూ. 65 లక్షల చీరలు తయారీకి ఆర్డర్ ఇచ్చిందన్నారు. మొత్తం రూ. 318 కోట్లు ఖర్చుతో, దాదాపు 9 కోట్ల మీటర్ల బట్ట తయారీకి అనుమతి ఇచ్చిందన్నారు. ఇప్పటికే 30%-%36 లక్షల చీరలు సిద్ధమయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ 15 లోపల ఉత్పత్తి పూర్తి చేయనున్నారని ఆమె వివరించారు. ప్రతి చీర విలువ సుమారు రూ. 800 ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల బతుకమ్మ చీరల పంపిణీతో పాటు సిరిసిల్ల చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుందని ఆమె తెలిపారు.

# సంపాదకీయం

## డబుల్ పెన్షన్ పై సర్వత్ర చర్చ...

తెలుగు రాష్ట్రాల్లో 'డబుల్ పెన్షన్' వార్త చర్చనీయమైంది. ఒకేఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి... ఏదైనా కారణాలవల్ల నెలకో, రెండు నెలలకో 'మాజీ' అయినా జీవితాంతం పింఛను పొందవచ్చు. అదే నేత... ఎంపీగా గెలిస్తే, మాజీ అయిన తర్వాత ఆ హోదాలో మరో పింఛను ఇస్తారు. మాజీ ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు పింఛను ఇస్తే... మాజీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం రూ.31వేలు జీవితాంతం చెల్లిస్తుంది. ఇలా ఒకే వ్యక్తికి రెండేసి పింఛన్లు ఇవ్వడంలో హేతుబద్ధత ఏమిటో ఎవరికీ అర్థం కాదు. పార్లమెంటు చట్టం ప్రకారం మాజీ ఎంపీలకు, రాష్ట్ర శాసనసభ చట్టాల ప్రకారం మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్లు ఇస్తున్నారు. కానీ... ఒకే వ్యక్తికి రెండు పింఛన్లు ఇవ్వకూడదనే చట్టం మాత్రం లేదు. మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్యేగా పని చేసి రెండు పింఛన్లు తీసుకుంటున్న వారిలో మన రాష్ట్రంలో చాలామంది ఉన్నారు. వీరిలో... వందలు, వేల కోట్ల వ్యాపారాలు చేసే బడా పారిశ్రామిక వేత్తలు, స్టార్లు, రాజకీయ వారసు లూ ఉన్నారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఒక్కరోజు పని చేసి మాజీ అయినా జీవితాంతం రూ.30వేలు పింఛను వస్తుంది. పొరుగు రాష్ట్రం తెలంగాణలో మాజీ ఎమ్మెల్యేలకు రూ.50 వేలు పింఛను చెల్లిస్తున్నారు. ఇక... మాజీ ఎంపీలకు రూ.31 వేల పింఛను అందుతుంది. విచిత్రం ఏమిటంటే... ఒకే వ్యక్తి 2 పదవులు చేసి మాజీ అయ్యాక అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు పింఛన్లు ఇచ్చేస్తున్నాయి. ఏదేమైనా.. వాళు దీనిని వదులుకోవడంలేదు. మిగిలిన వాళ్లు తమకు తెలియకుండానే రెండూ తీసుకుంటున్నారు. ఒకే వ్యక్తి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేస్తే రెండు పెన్షన్లు తీసుకోవడం సరికాదంటూ ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన డబ్ల్యూడీ గణేశ్ అనే ఆర్టీఐ కార్యకర్త అభిప్రాయపడ్డారు. చట్టసభ సభ్యులుగా పనిచేసిన మాజీలు ఏదో ఒక పెన్షన్ తీసుకుని మరొకటి వదిలేయాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, చట్టం అనుమతిస్తుంది కాబట్టే, వారు డబుల్ పెన్షన్ తీసుకుంటున్నారని, ఇదేమీ నేరం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తెలుగునాట ఇలా డబుల్ పెన్షన్ తీసుకుంటున్న వారు 21 మంది ఉండగా, వారిలో సెలబ్రిటీలు, బడా వ్యాపారులు కూడా ఉన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా పనిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవితాంతం పెన్షన్లు ఇస్తాయి. వారు మరణించిన తరువాత వారి భార్య/భర్తకు కూడా పెన్షన్ ఇస్తాయి. ఎంపీలుగా పనిచేసిన వారికి భారత ప్రభుత్వం రూ.31 వేల పెన్షన్ ఇస్తుండగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి ఏపీ ప్రభుత్వం కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.50 వేల వరకు పెన్షన్ ఇస్తోంది. ఇక తెలంగాణ కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.70 వేల వరకు ఇస్తోందని గణేశ్ చెప్పారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ప్రకారం తాను చేసిన దరఖాస్తుకు అధికారుల నుంచి వచ్చిన సమాధానంలో ఎంపీలు, ఎమ్మెల్యేల పెన్షన్ల డేటా తెలుసుకున్నానని గణేశ్ చెప్పారు. దాని ప్రకారం.. ప్రస్తుతం భారత్‌లో 2,229 మంది మాజీ ఎంపీలు పెన్షన్లు తీసుకుంటుండగా, ఏపీలో 473 మంది, తెలంగాణలో 465 మంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెన్షన్ తీసుకుంటున్నట్టు తెలిసిందని గణేశ్ అంటున్నారు. ఇవి కాకుండా వారికి ఇతర సదుపాయాలు ఉంటాయని ఆయన చెబుతున్నారు. పెన్షన్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని, అలాంటి వారికే పెన్షన్ వస్తుందని ఆయనంటున్నారు. "చట్ట ప్రకారం రెండు పెన్షన్లు తప్పు కాకపోవచ్చు. కానీ, రాజభరణాలను రద్దు చేసిన తీరులోనే వీటిని రద్దు చేయాల్సిన సమయం వచ్చింది. అప్పట్లో సొంత ఆస్తులు అమ్ముకున్న నాయకుల కోసం ఈ పెన్షన్లు వంటివి వచ్చాయి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అసలు పెన్షన్లే వద్దు అనడం లేదు. ఒక మనిషికి ఒక పెన్షన్, అది ఎమ్మెల్యేదో లేదా ఎంపీదో చాలు అంటున్నాను. ఇప్పుడు సుందరయ్య, ప్రకాశం, సంజీవయ్య వంటి వారు లేరు. పెన్షనే వద్దంటే అన్యాయం. ఒకటి చాలు, రెండు వద్దు అంటున్నాను" అని అన్నారు గణేశ్. ది శాలరీస్ అండ్ పెన్షన్ యాక్ట్' ప్రకారం ఎంపీలకు, తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్థానిక చట్టాల ప్రకారం ఈ పెన్షన్లను చెల్లిస్తున్నారు. 2004 తరువాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి కూడా పెన్షన్లు ఉండవు. అంతేకాదు, ప్రభుత్వ రంగ సంస్థలు అంటే పీఎస్‌యూలలో పనిచేసే వారికి కూడా నామమాత్రపు పెన్షన్ వస్తుంది. లేని సౌకర్యం చట్టసభల సభ్యులకు మాత్రం ప్రభుత్వం ఎందుకు ఇవ్వాలని యాక్టివిస్టులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ మీద సబ్సిడీ వదులుకోమని చెబుతున్న ప్రభుత్వాలు, డబుల్ పెన్షన్ వదులుకోమని ఎందుకు చెప్పడం లేదు?. ఈ జాబితాలో వందల కోట్ల ఆస్తులున్న వారు కూడా ఉన్నారు. పన్ను కట్టే వ్యక్తిగా అడిగే హక్కు నాకు, నాతో పాటు మనందరికీ ఉంది" అన్నారు గణేశ్. చట్ట ప్రకారం రెండు పెన్షన్లు తీసుకోవడం నేరం కాదు కాబట్టి, వారిని విమర్శించాల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "ఇందులో విమర్శించడానికి ఏమీ లేదు. ఎవరైనా కావాలంటే స్వచ్ఛందంగా తమ పెన్షన్ వదులుకుంటే బావుంటుంది. కానీ, వారిని వ్యక్తిగతంగా తప్పు పట్టాల్సిన అవసరం లేదు. కొందరు ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడే జీతం తీసుకోరు, మరికొందరు తీసుకుంటారు. అందులో ధనిక, తక్కువ ఆదాయం అన్న తేడా లేదు. మేం చేసిన దానికే ఇస్తున్నారు కదా అని వారు అనుకోవచ్చు. దానికి చట్టం అనుమతిస్తుంది. అయితే చట్టం మార్చాలి లేదా వ్యక్తిగత నిర్ణయానికి వదిలేయాలి. అంతేకానీ, చట్ట ప్రకారం తీసుకుంటున్న వారి విషయంలో ఇలా పేర్లు తీసుకుని, ఫోటోలు వేసి ఏదో నేరం చేసినట్టు చూపించడం మంచిది కాదు" అని రాజకీయ విశ్లేషకులు కటారి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం ఈ పెన్షన్లను ఎంపీలకు 'ది శాలరీస్ అండ్ పెన్షన్ యాక్ట్' ప్రకారం, తెలుగు రాష్ట్రాల చట్టసభల సభ్యులకు స్థానిక చట్టాల ప్రకారం చెల్లిస్తున్నారు. ఇవి 1953-54 ప్రాంతానికి చెందిన చట్టాలు. ప్రస్తుతం ఈ చట్టాలకు సవరణ చేసి డబుల్ పెన్షన్ విధానం రద్దు చేయాలని గణేశ్ డిమాండ్ చేస్తున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ తాను త్వరలో హైదరాబాద్, విజయవాడల్లో నిరసన కార్యక్రమాలు చేపడతానని గణేశ్ బీబీసీతో అన్నారు. అసలు మొత్తంగా ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేసిన వారికి పెన్షన్లు రద్దు చేయాలంటూ కొందరు గతంలో సుప్రీంకోర్టుకు వెళ్లగా, దాన్ని కోర్టు కొట్టేసింది. మదనపల్లికి చెందిన డబ్ల్యూడీ గణేశ్ ఓ ఆర్టీఐ యాక్టివిస్టు. తాను రెండేళ్లుగా ప్రజాస్వామ్య సంస్కరణల కోసం పోరాడుతున్నట్టు ఆయన చెప్పారు. డబుల్ పెన్షన్ల తొలగింపుతో పాటు, పార్టీ ఫిరాయింపు నిబంధనలలో సంస్కరణలు చేసి స్పీకర్ స్థానంలో ఎన్నికల సంఘానికి బాధ్యత ఇవ్వడం, ఒక నాయకుడు ఒక పదవిలోనే ఉండేలా చూడటం, ఒకేసారి రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయకుం డా చూడటం, మంత్రి కావాలంటే ముందుగా కచ్చితంగా ఎమ్మెల్యే లేదాఎంపీ లేదా ఎమ్మెల్సీ తప్పకుండా అయ్యేలా చూడటం ? ఇలా ంటి కొన్ని సంస్కరణల కోసం పోరాడుతున్నట్టు ఆయన చెప్పారు.

# తాటి, ఈత చెట్లు గీత కార్మికుల జీవనోపాధికి దోహదం చేస్తాయి..

## కాప్రా చెరువు కట్ట వద్ద తాటి, ఈత చెట్లను నాటిన అధికారులు, గౌడ సంఘం నాయకులు

## జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ కె. నవీన్ కుమార్





**కాప్రా, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ)** గీత కార్మికుల జీవనోపాధికి తాటి,ఈత చెట్లు ఎంతో దోహదం చేస్తాయని మల్కాజిగిరి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ కె. నవీన్ కుమార్ అన్నారు. కాప్రా ఎల్లారెడ్డి గూడ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాప్రా చెరువు కట్ట వద్ద తాటి, ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ గౌడ సంఘాలు తమ సొంత స్థలాల్లో, ఇతర సామాజిక స్థలాల్లో ఈత వనాలను అభివృద్ధి చేయాలని సూచించారు. తద్వారా గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని, ఆరోగ్యకరమైన పానీయాలు, బెల్లం, ఇతర ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి, ఘట్కేసర్ ఎస్‌హెచ్ ఓ జూపల్లి రవి,సబ్ ఇన్ స్పెక్టర్లు సంగీత మోదుగు, వి. నందిని,కానిస్టేబుళ్లు రాజేష్, ప్రవీణ్ కుమార్ తదితరులతో పాటు కల్లు గీతా పారిశ్రామిక సహకార సంఘం నాయకులతో కలిసి మొక్కలునాటారు. ఈ కార్యక్రమంలో కల్లు గీతాపారిశ్రామిక సహకార సంఘం నాయకులు బి.ఎ. రామచంద్ర గౌడ్, టి.జ్ఞానేశ్వర్ గౌడ్, పాందాల బాలయ్య గౌడ్, రామకృష్ణ గౌడ్, కె. నారాయణ గౌడ్, బైరి భాస్కర్ గౌడ్, బైరి రవీందర్ గౌడ్, డి.జైహింద్ గౌడ్, కె. మైసయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ పారిశ్రామిక వాడలో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు



**కుషాయిగూడ సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ):** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కుషాయిగూడ పారిశ్రామిక వేత్తల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. అన్న ప్రసాద దాత, ప్రముఖ పారిశ్రామిక వేత్త, బొండాడ రాఘవేంద్ర రావు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు వేలకు పైగా భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు కాకుమాను కిషోర్, వెంకట రమణ, కింగ్స్ బాబు, ఎంఎస్ఎన్. రాజు, మధు, హైటెక్ బాబు, కెడిఎస్ నరేందర్, యుఎస్ఎన్ మూర్తి, సుధాకర్, శివ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొత్త రామరావు, నాయకులు కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## లంబోదర లడ్డూను రూ. 61,116లకు దక్కించుకున్న రమేష్ యాదవ్



చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ నగర్ వినాయక మండపంలో శుక్రవారం నిర్వహించిన లడ్డు వేలం పాటలో హ్యాపీ సిరమిక్స్ టైల్స్ అధినేత ఎన్. రమేష్ యాదవ్ రూ.61,116 లకు లడ్డూను కైవసంచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి కృపతో ప్రతి సంవత్సరం ఉత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయని, సమాజంలో ఐక్యత, భక్తి భావం పెంపొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తున్నాయని తెలిపారు. లడ్డూ కైవసం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

- (చర్లపల్లి, తెలంగాణ దిశ)

# జిందాల్‌కే ఐరన్ ఓర్



**- ప్రభుత్వరంగ సంస్థలకు మోకాలడ్డు!**

**- గత అనుభవం నుంచి పాఠం నేర్చుకోని ప్రభుత్వం**

**అనంతపురం, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దులోని ఐరన్‌ఓర్ మరోమారు ప్రయివేటుకు అప్పజెప్పేందుకే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపింది. జెఎస్‌డబ్ల్యు సంస్థకు చెందిన సౌత్ వెస్ట్ మైనింగు సంస్థకు 3,317.50 ఎకరాల విస్తీర్ణంలోని అటవీ భూమిలో ఐరన్ ఓర్ ఖనిజాన్వేషణకు అనుతులిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ జిందాల్‌కు సంబంధించినది. గత అనుభవం నుంచి ప్రభుత్వం పాఠం నేర్చుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎపిఎండిసికి ఈ ప్రాంతంలో ఇది వరకే అనుమతులిచ్చినప్పటికీ అనేక అడ్డంకులు కల్పిస్తూ కట్టడి చేస్తూ వచ్చారన్న విమర్శలు ఉన్నాయి. కంపోజిట్ లైసెన్సు గడువు ముగిసిన సమయంలో ఇక తవ్వకాలు చేపట్టలేమని ఆ సంస్థ దరఖాస్తు పెట్టుకోవడంతో లైసెన్సును ఇ-యాక్షన్‌లో ప్రయివేటు సంస్థ అయిన సౌత్ వెస్ట్ మైనింగ్ సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సంస్థ తవ్వకాలు జరిపి ఖనిజాలు గుర్తించేందుకు వీలుగా కంపోజిట్ లైసెన్స్‌ను మంజూరు చేసింది. ఈ సంస్థ ఖనిజ అన్వేషణలో గుర్తించిన ప్రాంతాల్లో తవ్వకాలకు తర్వాత అనుమతులు ఇవ్వనుంది. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో జెఎస్‌డబ్ల్యు సంస్థ ముందుకొచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ సంస్థ వెనక్కి వెలుతున్న ప్రచారం జరిగింది. టిడిపి ముఖ్య నేతలు మాత్రం తప్పకుండా ఇక్కడే ఏర్పాటవుతుందని మహానాడులోనూ ప్రకటించారు. ఆ సంస్థకు సంబంధించిన కంపెనీకే ఇప్పుడు ఐరన్ ఓర్ లీజ్‌ను ప్రభుత్వం ఇచ్చింది.

మూడు ప్రభుత్వరంగ సంస్థలను కాదని: ఇనుప ఖనిజ తవ్వకాలు, ముడి ఇనుము తయారు చేయడానికి ముందుకొచ్చిన ప్రభుత్వరంగ సంస్థలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తూ వచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. అనంతపురం జిల్లా నేమకల్లు ప్రాంతంలో ఉక్కు గుళ్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు మూడు ప్రభుత్వరంగ సంస్థలు ముందుకొచ్చాయి. ఇందులో తవ్వకాలు జరిపేందుకు ఎపిఎండిసి ఉండగా, ఉక్కుగుళ్ల తయారీ కోసమని కుదురేముఖ్ సంస్థ, ఇందులో తయారైన ఉక్కుగుళ్లను రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (విశాఖ ఉక్కు)కు సగమిచ్చే విధంగా మూడు సంస్థల మధ్య 2012 జూన్‌లో త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఆ తర్వాత కుదురేముఖ్ ఇక్కడికి వచ్చి నేమకల్లులో 2012లోనే శంకుస్థాపన చేసింది. ఆ సంస్థకు ఇనుప ఖనిజం కేటాయింపుల్లో తీరని జాప్యం జరుగుతూ వచ్చింది. ఆ త్రైపాక్షిక ఒప్పందం ఏమైందనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు.

ప్రయివేటుకిస్తే లూటీయే?: ప్రయివేటు సంస్థలకు ఇస్తే ఏ రకంగా లూటీ జరుగుతుందన్నది చెప్పడానికి చక్కటి ఉదాహరణ ఓబుళాపురం ఇనుప ఖనిజమే. ఇక్కడ 2007 నుంచి 2009 మధ్యలో 29 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఇతర దేశాలకు తరలిపోయింది. సుమారు రూ.10 వేల కోట్లకుపైగా ప్రజాధనం ఒకరికి చేరిందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణఇంకా కొనసాగుతూనేఉంది. ఇంత జరిగినా ప్రభుత్వం తిరిగి ప్రయివేటు సంస్థలకే ఇనుప ఖనిజాన్ని అప్పగించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## ప్రొఫెసర్ కోదండరామ్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

**- దొమ్మాటి కిరణ్ కుమార్ రావు**



తెలంగాణ ఉద్యమ బిడ్డ ప్రొఫెసర్ కోదండరామ్ కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మీడియా కన్వీనర్, జేఏసీ మాజీ కన్వీనర్ దొమ్మాటి కిరణ్ కుమార్ రావు కోరారు. శుక్రవారం ప్రొఫెసర్ కోదండరాం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా హబ్సిగూడలోని ఆయన నివాసంలో ప్రొఫెసర్ కోదండరామ్ ను కిరణ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెఏసి నాయకుడు టియుఎఫ్ రాష్ట్ర గరిక సుధాకర్, కన్వీనర్ ఎరువ అశోక్, వీర చారి తదితరులు పాల్గొన్నారు.

- (హబ్సిగూడ, తెలంగాణ దిశ)

# యూరియా సరఫరాపై విజిలెన్స్ నిఘా

**విజయవాడ, తెలంగాణ దిశ:** ఏపీలో పలుచోట్ల యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఫోకస్ పెట్టింది. యూరియా కొరత రానివ్వకుండా చర్యలు చేపట్టామని వెల్లడించింది. విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేశామని? జిల్లాల వారీ మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరు ప్రభుత్వాలు కూడా యూరియా సరఫరా విష యంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. యూరియా కొరత లేకుండా తక్షణమే సరఫరా చేయాలని కోరుతున్నాయి. యూరియా సరఫరా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ తెలిపింది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని పేర్కొంది. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు... సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యం గా ప్రభుత్వ పని చేస్తోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో



యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టింది. 2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎరు వుల వినియోగం గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 8,76,928 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ సంవత్సరం అదే కాలానికి 10,96,239 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి.

## కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**మాజీ వార్డు అధ్యక్షులు టెంకురాల కిషోర్..**

**జమ్మికుంట, తెలంగాణ దిశ:** జమ్మికుంట మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట మున్సిపాలిటీ పరిధి నాలుగవ వార్డు బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కౌన్సిలర్ అభ్యర్థి టెంకురాల కిషోర్, ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతేనే తప్ప బయటకు వెళ్లకూడదని ముఖ్యంగా రైతులు వ్యవసాయ బావుల దగ్గర కరెంటు మీటర్ల వద్ద జాగ్రత్త వహించాలని, చెరువులు కుంటలు ప్రవహిస్తున్న కాలువల వద్ద చిన్న పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాలని, గ్రామాలలో పశువులను కరెంటు స్తంభాలకు కట్టరాదని వర్షాలు పడుతున్న సమయంలో కరెంటు స్తంభాలను ముట్టుకోరాదని, ముఖ్యంగా మహిళలు బట్టలు ఆర వేసేటప్పుడు ఇనుప వైర్ల పట్ల జాగ్రత్త వహించాలని.

# అంజనీ పుత్ర ఆధ్వర్యంలో ఘనంగా అన్న దాన కార్యక్రమం..

## -అన్నదాతా సుఖీభవ అంటూ భక్తుల ఆశీర్వచనాలు



**మంచిర్యాల, తెలంగాణ దిశ :** వినాయక నవ రాత్రోత్సవాల్లో మొదటి రోజు న అన్న దానం 2000 వేల మందికి పైగా ఘనంగా నిర్వహించారు. ప్రజలు అన్నదాతా సుఖీభవ అంటూ భక్తుల ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్న దానం గొప్పదని. సామాజిక కార్యక్రమాలలో అంజనీ పుత్ర సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో అంజనీ పుత్ర అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. దాదాపు వినాయక ప్రతిమ ప్రతిష్ఠించిన ప్రతిచోటా అన్నదానం తప్పనిసరయింది. జనాభా సంఖ్యకు అనుగుణంగా భారీగానే అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లుసూరినేనీ కిషన్, కాసర్ల సదానందం, డైరెక్టర్ లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. విందు భోజనాలు..: నోరూరించే హల్వా, జిలేబీ, ఒకవైపు.. చింతపం డుతో చేసిన పులిహోర మరోవైపు. ఔరా అనిపించేలా వంకాయ మసాలా ఇంకో స్పెషల్. ఇక వెజ్ బిర్యానీ, పాలకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, సాంబార్, పెరుగు, టమాట, దోసకాయ చట్నీలు, పాపడాలు.. ఇదీ వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాల్లో కనిపిస్తున్న మెనూ. వంటల విషయంలో అంజనీ పుత్ర సంస్థ ఎక్కడా తగ్గడంలేదు. అందుకు తగ్గట్టు భారీగా ఏర్పాట్లు చేసారు. చిన్న చిన్న గల్లీల్లో1500 నుంచి2000 మందికి భోజనాలువడ్డించేందుకు ఏర్పా ట్లు చేసారు...భక్తులకు కడుపునిండా వడ్డించేందుకు ఘనంగా ఏర్పాటు చేసి వడ్డించారు.. జిల్లా వ్యాప్తంగా అంజనీ పుత్ర గణపతి మండపం గురించి ప్రత్యేకంగా చర్చించుకునేలా వసతులు కల్పిస్తున్నాయి.

# సహాయకచర్యలకు హెలికాప్టర్లు

## ఆర్మీ హెలికాప్టర్లు పంపాలను బండి ఆదేశం

**కరీంనగర్, తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు- ప్రాంతాల ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో వరదల్లో ఉన్నవారిని రక్షించడానికి రాష్ట్రానికి మూడు ఆర్మీ హెలికాప్టర్లు రావాల్సి ఉంది. హెలికాప్టర్లు ఎంతకు రాకపోయే సరికి రక్షణ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు- కేంద్ర రక్షణ శాఖ అధికారులు చెప్పారని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బాధిత ప్రాంతాలకు చాపర్ల రావడంలో ఆలస్య మవుతోందని వివరించారు. ప్రత్యామ్నాయ స్టేషన్ల నుంచి చాపర్లను రప్పించేందుకు చర్యలు చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. నాందెడ్, బీదర్ స్టేషన్ల నుంచి చాపర్లను పంపేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు బండి సంజయ్ స్పష్టం చేశారు. భారీ వర్షాలతో ఎస్సారెస్పీ, మానేరు నదులకు విపరీతంగా వరద వస్తోందని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తీసుకుని చర్యలు చేపట్టాలన్నారు. సహాయక చర్యలకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు ఎన్డీఆర్ఎఫ్ టీ-ంలు నిమగ్నమయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. వీలైనంత తొందరగా చాపర్లను పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కోరారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముప్పు ప్రాంతాల వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైతే.. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బండి సంజయ్ సూచిస్తున్నారు. తెలంగాణకు ఆర్మీ హెలికాప్టర్ల రాక ఆలస్యంపై రక్షణ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ చేశారు. తెలంగాణకు మూడు హెలికాప్టర్లను రెడీగా ఉంచామని కేంద్ర రక్షణ శాఖ అధికారులు తెలియజేశారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం అనుకూలించక పోవడంతో బాధిత ప్రాంతాలకు చాపర్ల రాక ఆలస్యమవుతోందని అధికారులు వివరించారు. ప్రత్యామ్నాయ స్టేషన్ల నుండి చాపర్లను రప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. నాందేడ్, బీదర్ స్టేషన్ల నుండి చాపర్లను పంపేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

# ఎన్‌హెచ్ 44పై రాకపోకలపై ఆంక్షలు

## భారీ వర్షలతో పలుచోట్ల కొట్టుకుపోయిన రోడ్లు వాహనాలను దారి మళ్లించినట్లు ట్రాఫిక్ డిసిపి వెల్లడి




**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల 44వ నంబర్ జాతీయ రహదారి దెబ్బతిం ది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఎన్‌హెచ్ 44 వైపు వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద మళ్లిస్తున్నట్లు- పేర్కొన్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లాలని గజరావ్ భూపాల్ సూచించారు. పోలీసులకు ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మళ్లింపు మార్గాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ప్రయాణికులకు సహాయం కోసం ట్రాఫిక్ పోలీసులు, హైవే పెట్రోలింగ్ బృందాలు అందుబాటులో ఉ ంటాయని పేర్కొన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారి ధ్వంసమైందని.. దీంతో 25 శాతం రాకపోకలు మాత్రమే జరుగుతున్నట్లు- ఆ జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు మేడ్చల్- రామాయంపేట్-కామారెడ్డి-డిచ్‌పల్లి మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. భారీ వాహనాలను మేడ్చల్ వద్ద.. సాధారణ వాహనాలను రామాయం పేట వద్ద మళ్లిస్తున్నట్లు- తెలిపారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్లే వాహనదారులకు నిర్మల్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులు నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి నుంచి ఎడమవైపునకు తిరిగి డైవర్షన్ మార్చుకుని వెళ్లాలని సూచించారు. కొండాపూర్ నుంచి మామడ, ఖానాపూర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

# సోలార్ పవర్ ప్లాంట్ నుండి వచ్చే వరదల వల్ల దెబ్బతిన్న పంటలు

## -నష్టపరిహారం చెల్లించాలంటున్న రైతులు



**మంథని, తెలంగాణ దిశ :** సోలార్ పవర్‌ప్లాంట్ నుండి వచ్చే వరదలవ ల్ల తమ పంట పొలాలు దెబ్బతిని నాశనం అయ్యాయని పోతారం గ్రావనికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంథని మండ లంపోతారం గ్రామంలో పూర్వాంచల్ సోలార్ పవర్ ప్లాంట్ రెన్యూ 15మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగే ప్లాంటును గతంలో నెలకొ ల్పారు. కానీ అధిక వర్షాల వల్ల ఈ ప్లాంట్ నుండి వచ్చే వరద వల్లపక్కనే ఉన్న తమ పంట పొలాలు దెబ్బతిన్నా యని,తమ కు నష్టపరిహారం కట్టించకపోతే ఆందోళనచేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. అధికారులు స్పందించి సోలార్ యజమా న్యంతో మాట్లాడి తమకు నష్టపరిహారం ఇప్పించాలని వారు కోరతున్నారు.


# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

## పెగడపల్లి మండలంలో అధికారుల సందర్శన



**పెగడపల్లి,తెలంగాణ దిశ :** జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండ లంలోఎడతెరిపి లేకుండా కురుస్తున్నటువంటి వర్షాల వలన పెగడ పల్లి మండల పరిధిలోని లింగాపూర్, శాలపల్లి, మద్దులపల్లి గ్రామా లలో నిండిన చెరువు లను, కల్వర్టను, రోడ్లపై వరద నీటితో ప్రవాహిస్తున్న లోతట్టు ప్రాంతాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ. శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ బి. రవీందర్, స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ సందర్శించారు. కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీటి ఉధృతి పెరిగితే ముంపుకు గురయ్యే ప్రాంతాలలో తక్షణమే తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

# బీజేపీ కమిటీలు ఎప్పుడు?



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణ బీజేపీ కమిటీ వేసేదెన్నడు? కొత్త అధ్యక్షుడు వచ్చాక వారంలో వేస్తామని ప్రకటించి నెల గడుస్తున్నా? దిక్కూ దివాణం లేకుండా పోయింది ఎందుకు? అధ్యక్షుడు ఎందుకు నిస్సహాయంగా ఉండిపోతున్నారు? తెర వెనక జరుగుతున్న తతంగం ఏంటి? అసలది ఇప్పట్లో తేలే వ్యవహారమా? లెట్స్ వాచ్. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుల ఎన్నిక ఒకే రోజు జరిగింది. ఏపీలో రాష్ట్ర కమిటీని వెంటనే ప్రకటించేశారు పార్టీ ఆ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. కానీ? తెలంగాణలో మాత్రం ఇంతవరకు అతీగతీ లేదు. అసలు ఎప్పుడు ప్రకటిస్తారో కూడా క్లారిటీ రాలేదు. పార్టీలో ఏ ఇద్దరు నాయకులు కలిసినా?. ఇప్పుడు దాని గురించే మాట్లాడుకుంటున్నారు. ఎవరెవరికి ఛాన్స్ ఉండవచ్చన్న చర్చోపచర్చలు నడుస్తున్నాయి. కానీ? ఎక్కడా వీసమెత్తు స్పష్టత రాలేదు. పైగా ఒక అడుగు ముందుకు, పది అడుగులు వెనక్కి అన్నట్టు నడుస్తోందట వ్యవహారం. రాష్ట్ర అధ్యక్షుడయ్యాక రామచంద్రరావు ఇప్పటికే ఒకసారి కమిటీపై చర్చించేందుకు ఢిల్లీ వెళ్ళి వచ్చారు. హైదరాబాద్‌లో సంఘ్ పెద్దలలో సమావేశం అయ్యారు. అయినా కమిటీ కూర్పుపై క్లారిటీ రానట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం, వాళ్ళంతా ఏదో ఒక విధంగా ఒత్తిడి తీసుకు వస్తుండడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారట అధ్యక్షుడు. ఆశావహులంతా తగ్గకుండా ఎవరికి వారు తమ గాడ్‌ఫాదర్స్‌ని సీన్‌లోకి దించుతుండటం కూడా సంక్లిష్టతకు కారణం అంటున్నారు. మరోవైపు గత కమిటీలో పని చేసిన వాళ్ళలో ఎవరికి అవకాశం ఇవ్వాలి, ఎవరిని పక్కన పెట్టాలన్న గందరగోళం కూడా ఉందంటున్నారు.అదే సమయంలో రకరకాల ఈక్వేషన్స్ తెర మీదికి వస్తున్నాయి. పదేళ్ళుగా రాష్ట్ర కమిటీలో ఉన్న వారికి ఈ సారి అవకాశం ఇవ్వొద్దని, యువతకి ప్రాధాన్యం ఇవ్వాలని, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్ధులుగా పోటీ చేసిన వారికి ఛాన్స్ ఇవ్వకూడదని, కొత్త రక్తాన్ని ఎక్కించాలని? ఒకటి కాదు, రెండు కాదు? ఇలాంటివి రకరకలా వాదనల్ని వినిపిస్తున్నారు పార్టీ నాయకులు. దీంతో అసలేం నిర్ణయం తీసుకోవాలో కూడా అర్థంకాని గందరగోళంలో ఉన్నారట ఢిల్లీ పెద్దలు. కొందరు నేతలు తాము సూచించిన వారికే కమిటీలో స్థానం ఇవ్వాలని గట్టిగా పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. తమవాళ్ళ కోసం పట్టుబట్టే నాయకులు కొందరైతే? ఫలానా వాళ్ళకు ఇవ్వవద్దంటూ మోకాలడ్డుతున్న బ్యాచ్ కూడా ఒకటి తయారైందట. పైగా మేం వద్దన్న వాళ్ళకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సీన్ క్రియేట్ చేస్తున్నట్టు సమాచారం. ఇంకొందరైతే? కొత్త కమిటీ వేసేటప్పుడు మా అభిప్రాయం తీసుకోరా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఇలాంటివన్నీ కలిపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు తలనొప్పిగా మారాయట.ఇదెక్కడి లొల్లిరా? నాయనా అని ఆయన తల పట్టుకుంటున్నట్టు సమాచారం. వస్తున్న డిమాండ్స్, సమీకరణల్ని పరిగణనలోకి తీసుకుంటే? వీళ్ళందరినీ ఒప్పించి సమన్వయం చేయడం అంత తేలికైన వ్యవహారం కాదని చెప్పుకుంటున్నారు పార్టీ నాయకులు. ఈ క్రమంలో ఇది ఇప్పటికిప్పుడు తేలే వ్యవహారం కాదని, వినాయక నవరాత్రుల తర్వాతే కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అంటున్నాయి బీజేపీ వర్గాలు. పదవులు తక్కువగా ఉండడం, ఆశావహులు భారీగా పెరిగిపోవడంతో?ఇది అంత తొందరగా తేలే మేటర్ కాదంటున్నారు. పార్టీలో పెద్ద తలకాయలు పెరిగిపోవడం కూడా ఈ తాత్సారానికి మరో కారణమని తెలుస్తోంది. మొత్తం మీద ఎట్నుంచి ఎటు చూసినా? రకరకాల సంక్లిష్టతల మధ్య తెలంగాణ బీజేపీ కమిటీ ఎప్పటికి తేలుతుందో అర్థంకాని వాతావరణం ఉంది.

# రాష్ట్రంలో కరువు పారద్రోలిన ప్రాజెక్టు కాళేశ్వరం

## ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి




**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రాష్ట్రంలో కరువు పారద్రోలిన ప్రాజెక్టు కాళేశ్వరం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ అందరూ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్‌తో కలిసి వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి వాస్తవాలు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీపై ఉంది. బనకచర్ల, అనుసంధానం పేరిట ఏపీ, కేంద్రం తెలంగాణ హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలు ప్రజలకు తెలవాల్సిన అవసరం ఉంది. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని అంటున్నారు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దాదాపు 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందింది. కేవలం రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరం కుంగిపోయిందని అంటున్నారు. భారీ వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ ఆనకట్ట నిలబడింది, కావాలంటే అక్కడకు వెళ్లి చూద్దామని అధికార పార్టీ నేతలకు వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు.జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సీల్డ్ కవర్‌లో ఉండగానే ఏదో జరిగిందని పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతున్నారు. నివేదికను తప్పుపడుతున్నాం, సెక్షన్ 8బీ ప్రకారం వివరణ కోరలేదు, న్యాయస్థానంలో పోరాడుతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలు, ప్రయోజనాలను వివరించాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారాలు, గణాంకాలు, సాంకేతిక అంశాలతో ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని సభాపతిని అడిగాం. సభాపతి అందుబాటులో లేరు, కార్యదర్శి తీసుకోవడం లేదు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు శాసన సభాపతి అవకాశం ఇస్తారని కోరుతున్నాం. పీపీటీకి అవకాశం ఇవ్వకపోతే పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లు భావించాల్సి వస్తుంది. వివరించేందుకు పీపీటీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. సభాపతి సమయం ఇస్తే రేపు అయినా కలిసి వినతి పత్రం అందిస్తాం అని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

### వరద స్థితిగతులపై కలెక్టర్ తో ఎంపీ రవిచంద్ర సమీక్ష

**ఖమ్మం, తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఖమ్మం జిల్లాలో సంభవించే వరద స్థితిగతుల పై రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమీక్షించారు. ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. ఈ మేరకు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ తో ఫోన్లో మాట్లాడి భారీ వర్షాలు, వరదల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో ఇబ్బంది లేదని, కూడా భారీ వర్షం కురిస్తే వరదపోటు ఉండే ప్రమాదం ఉందని కలెక్టర్ తెలిపారు. ఒక వేళ అలాంటి పరిస్థితే వస్తే ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉ ందని ఎంపీ వద్దిరాజు కు కలెక్టర్ అనుదీప్ నివేదించారు. ఒకవేళ వరద తలెత్తై పరిస్థితి వస్తే ఎదుర్కొనేందుకు బిఆర్ఎస్ నుంచి కూడా అవసరమైన సహకారం అందిస్తామని ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా కలెక్టర్ కు తెలియజేశారు.

# మంత్రి పొన్నంకు తెలంగాణ సర్పంచుల సంఘం వినతి



**భూదాన్ పోచంపల్లి, తెలంగాణ దిశ :** పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ గౌడ్ కలిసి వినతి పత్రం అందజేశారు. లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేశామని, మిత్తిల భారంతో అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, మన్నె పద్మా రెడ్డి, నాయకులు గోడల ప్రభాకర్, అంజయ్య గౌడ్, వెంకటాపురం రాజేందర్, వెంకట్ రామ్ రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

## నార్నూర్, గాదిగూడ మండలాల్లో


# లోతట్టు ప్రాంతాలు జలమయం



**నార్నూర్, తెలంగాణ దిశ :** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాల్లోని వాగులు వంకలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బారిక్ రావు గూడ,దన్నుగూడ, మారుగూడ, కునికసా గ్రామ సమీపంలోని వాగులల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉప్పొంగింది. దీంతో ఆ గ్రామ ప్రజలు రెండు రోజులుగా బాహ్య ప్రపంచాన్ని దూరంగా ఉన్నారు. అత్యవసర సమయంలో కూడా బయటికి రాని పరిస్థితి నెలకొంది. వరద నీరు తగ్గేవరకు గ్రామ ప్రజలు బయటికి రాలేని దుస్థితి. కఖడ్కి, లోకారికే, అర్జుని, గుండాయి కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద తగ్గేవరకు వాహనాలు, ప్రయాణికులు నిరీక్షించాల్సి వచ్చింది. భారీ వర్షాలు కురుస్తుం డడంతో ఉమ్మడి మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా శాఖల అధికారులు కోరారు. . వర్షాలతో సమస్యలు తలెత్తితే తక్షణమే అధికారుల దృష్టికి తేవాలని కోరారు. వేకువ జామున నుంచి భారీ వర్షం కురిసింది.

# వానలతో అతలాకుతలం..




**హైదరాబాద్, తెలంగాణ దిశ :** ఆకాశానికి చిల్లుపడ్డట్టు.. వరుణ దేవుడికి పట్టరాని కోపం వచ్చినట్టు.. కుండ పోత వాన.. జోరైన జడివాన.. మిన్నూ మన్నూ ఏకం చేసే విధంగా వర్షం కురిసింది. వర్షం ధాటికి కొండ ప్రాంతాల నుంచి వరద విపరీతంగా వచ్చింది. చెట్లు కొట్టుకు వచ్చాయి. రోడ్లు నామరూపాలు లేకుండా పోయాయి. పెద్ద పెద్ద భవనాలు కుప్ప కూలిపోయాయి. వంతెనలు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ లో ప్రస్తుతం విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. కొద్దిరోజుల క్రితమే ఈ రాష్ట్రాలలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. వర్షాలు విపరీతంగా కురవడంతో ఈ రాష్ట్రాలలో విపరీతమైన నష్టం చోటుచేసుకుంది. కనివిని ఎరుగని స్థాయిలో జమ్ము కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. జమ్మూ నగరంలో గడచిన 12 గంటల్లో ఏకంగా 30 సెంటీమీటర్ల కు మించిన వర్షపాతం నమోదయింది. రోడ్లపై నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పాఠశాలలు, కళాశాలకు సెలవు ప్రకటించారు. మరోవైపు పంజాబ్ రాష్ట్రంలోనూ విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. వరదలు కూడా ముంచెత్తుతున్నాయి. వరద వల్ల రోడ్లు నామరూపాలు కోల్పోయాయి. భవనాలు చూస్తుండగానే నేలకూలిపోయాయి. పంట పొలాలు ఇసుక మేటలు వేశాయి.హిమాలయ పర్వతాలకు దగ్గరగా ఉన్న రాష్ట్రాలలో ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. మండు వేసవిలోనే ఈ ప్రాంతంలో వర్షాలు కురిశాయి. ఇప్పుడు కూడా అదే స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. కాకపోతే గడిచిన వాన కాలంలో ఈ స్థాయిలో వర్షాలు కురవలేదు. ఈసారి మాత్రం విపరీతమైన వర్షాలు కురుస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ వర్షాల వల్ల వందల కోట్లలో నష్టం వాటిల్లు ఉంటుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. మరి కొద్ది రోజులపాటు ఈ రాష్ట్రాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది. వరద నీటి వల్ల ఈ ప్రాంతంలోని నదులు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతంలో దట్టమైన మేఘాలు ఆవరించి ఉ ండటం వల్ల క్లౌడ్ బరస్ట్ ఏర్పడుతోందని.. గతంలో ఎన్నడు కూడా ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదని నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిలో వర్షాలు కురుస్తుంటే మనుషులు బతకడం కష్టమేనని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు.డు పట్టణాలలో 30 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయింది. ఫలితంగా ఈ పట్టణాల పరిధిలో గ్రామాలన్నీ జలమయమయ్యాయి. కామారెడ్డి పట్టణ పరిధిలోని బొగ్గుగుడిశా గ్రామం నోట మునిగింది. ఈ గ్రామంలో 9 మంది వాగులో చిక్కుకుపోవడంతో.. రెస్క్యూ బృందాలు వెంటనే స్పందించాయి. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. సుమారు గంటపాటు జరిగిన ఈ ఆపరేషన్లో దాదాపు 20 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఆ తర్వాత ఆ 9 మందిని అత్యంత సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. జల ప్రవాహం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో వాగులో చిక్కుకుపోయిన తొమ్మిది మంది ఆర్తనాదాలు చేశారు.

రికార్డు స్థాయిలో వర్షం..: మేఘ విస్ఫోటనం వల్ల కామారెడ్డి, మెదక్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదయింది. మెదక్లోని చుట్టుపక్కల గ్రామాలు మొత్తం జలమయమయ్యాయి. కామారెడ్డిలో రైల్వే ట్రాక్ కింది నుంచి వరద నీరు ప్రవహించడంతో.. ట్రాక్ గాలిలో వేలాడుతోంది. దీంతో నిజామాబాద్, కామారెడ్డి మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పలు రైళ్ల రాకపోకలను దక్షిణ మధ్య రైల్వే నిలిపివేసింది. వేరే మార్గం మీదుగా రైళ్లను నడుపుతోంది.. కామారెడ్డిలో కనివిని ఎరుగని స్థాయిలో వర్షాలు కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది.. పంటచేలన్నీ ఇసుక మేటలు వేశాయి. చేతికొచ్చిన పత్తి నాశనమైంది. పసుపు తోటలు నేలమట్టమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రోడ్లన్నీ కొట్టుకుపోయాయి.

చెరువు కట్టలకు గండ్లు: విపరీతమైన వర్షం వల్ల కామారెడ్డి, మెదక్ పట్టణాలలో చెరువులు అలుగులు పోస్తున్నాయి. పలు ప్రాంతాలలో చెరువు కట్టలకు గండ్లు పడ్డాయి. దీంతో చెరువులో నీరు మొత్తం పంట పొలాలను ముంచింది. ఇసుక మేటలు వేయడంతో పంట పొలాలు దేనికీ పనికిరాకుండా పోయాయి. అయితే ఈ స్థాయిలో ఈ పట్టణాలలో వర్షపాతం నమోదు కావడం ఇటీవల కాలంలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. కామారెడ్డి, మెదక్ లో నీట మునిగిన ప్రాంతాలలో కలెక్టర్, ఎస్పీలు పర్యటిస్తున్నారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర రెస్క్యూ బృందాలతో సమన్వయం చేసుకుంటూ నీటమునిగిన ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేర్చుతున్నారు. ఇప్పటివరకు ప్రాణ నష్టం చోటు చేసుకోకపోయినప్పటికీ.. ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ నష్టం వందల కోట్లల్లో ఉంటుందని వారు వివరిస్తున్నారు.

## భారీ వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు..

### పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



బోథ్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షం పడుతుండడంతో బోథ్ మండలంలోని ధన్నూర్ (బి), నక్కల వాడ, పాత కరత్వాడ, కంటేగామా-నిగిని, చింతల బోరి గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి ధన్నూర్ బ్రిడ్జి పై నుంచి పారుతున్న వరద ప్రవాహంలో బైక్ పై వస్తున్న శంకర్ అనే వ్యక్తి వాగులో కొట్టుకుపోయి సురక్షితంగా బయటపడ్డాడు. రాత్రి పొచ్చేర సబ్ స్టేషన్ పై పిడుగు పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మరమ్మత్తులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. సోనాల వజ్జర్ ప్రధాన రహదారిపై ఉన్న లో లెవెల్ వంతెన పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు పడుతుండడంతో నేరడిగొండ మండల కేంద్రంలోని పలు కాలనీలు నీట ముగిసిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలు కాలనీలు పరిశీలించారు. ధన్నూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సీఐ వెంకటేశ్వరావు, ఎమ్మార్వో సుభాష్ చంద్ర,ఎస్సై శ్రీ సాయి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రమాదాలు జరగకుండా బోథ్ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# ఆ ప్రాంతాలకు వెళ్ళకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయండి..

## అధికారులకు కలెక్టర్ ఆదేశం



**సంగారెడ్డి, తెలంగాణ దిశ :** జిల్లాలో కురిసిన వర్షాల పట్ల అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి పట్టణ పరిధిలోని రేణిగుంట ఎర్రగుంట, మాసానుకుం ట చెరువులు వరద నీటితో పొంగిపొర్లుతున్న వాటిని పరిశీలించా రు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. రేణిగుంట చెరువులో ఏర్పడిన గండిని పరిశీలించి తక్షణ మరమ్మత్తులు చేయాలని స ంబధిత అధికారులకు ఆదేశించారు. చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు కిందకు పారేలా మార్గాలు కల్పించాల న్నారు.వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, రెవెన్యూ, పోలీస్, నీటిపా రుదల , మున్సిపల్ శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 08455 - 276155 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువులు, వాగులు పొంగిపొర్లే పరిస్థితి నెలకొందని ఇంజనీర్లు, అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. చెరువుల సమీప గ్రామాలకు ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు.

జ్వర సర్వేలు చేయండి..: ఇంటింటికీ తిరిగి ఇంటెన్సివ్ జ్వర సర్వేలు నిర్వహించి, సత్వర చికిత్స అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తండాలలో గర్భిణీ స్త్రీలు నిశితంగా పర్యవేక్షణలో ఉండాలని వైద్యాధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు రోజు వారీగా తండాలకు వెళ్ళి గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితిపై వివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి కేసును పర్యవేక్షించి, తల్లీబిడ్డల రక్షణకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు.

వర్షపు నీరు నిలువకుండా చూడాలి..: మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో వర్షపు నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదలడం, మందు పిచికారి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, మురుగు కాలువలను శుభ్రం చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు, జంక్షన్లో గుంతలను పూడ్చాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆర్ డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. నీటి నమూనాలకు ల్యాబ్ పరీక్షలు చేయాలని, ట్యాంకులను క్లోరినేట్ చేసి శుద్ధి చేయాలన్నారు. రోడ్లపై గుంతలు ఉన్న చోట 48 గంటల్లోపు తాత్కాలిక మరమత్తులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్ రెడ్డి, సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను వెంటాడుతున్న యూరియా కొరత




రైతన్నలను యూరియా కొరత వెంటాడు తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కట్టంగూర్ పీఏసీఎస్ కు ఉదయం 440 బస్తాల యూరియా రావడంతో విష యం తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటలకే అక్కడికి చేరుకు న్నారు. పాస్‌బుక్స్‌ను సీరియల్‌లో పెట్టి 440 బస్తాలకు గానూ 200 మంది రైతులు తమ పేరన్లు సీరియల్ ప్రకారం నమోదు చేసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారి గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల పహారా లో సింగిల్ విండో సిబ్బంది రాంబాబు, సైదులు, యాదగిరి, సైదమ్మ ఒక్కో రైతుకు భూమి విస్తీర్ణం బట్టి 2 నుంచి 3 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. శుక్రవారం మరో లారీ లోడు యూరియా వస్తుందని ప్రతి రైతుకు అందజేస్తామని ఏఓ గిరి ప్రసాద్ తెలియజేయడంతో యూరియా దొరకని రైతులు నిరాశతో తిరిగి వెళ్లిపోయారు.

# 6 గంటల రెస్క్యూ ఆపరేషన్.. పశువుల కాపరి సేఫ్



**నిర్మల్, తెలంగాణ దిశ :** లక్ష్మణచందా మండలం మునిపెల్లి గ్రామంలో వాగు ప్రవాహం అవతల గోదావరి వరద ఉధృతిలో చిక్కుకుపోయిన పశువుల కాపరిని ఎట్టకేలకు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చిన నేపథ్యంలో ఆమె స్వయంగా అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో బాధితుడు శంకర్ ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ముగ్గురు పశువుల కాపరులు శ్రీనివాస్, లింగన్న, శంకర్ అనే ముగ్గురు పశువులు తీసుకువెళ్లారు. ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగిపోవడంతో పశువుల కాపరులు వరదలు చిక్కుకున్నారు. నిన్ననే పోలీసుల సహాయంతో లింగన్న, శ్రీనివాస్ ఇద్దరినీ బయటకు తీసుకువచ్చారు. కాగా శంకర్ అనిపశువుల కాపరి వరదలోనే చిక్కుకున్నాడు. సుమారు 24 గంటలకు పైగా రాత్రంతా వరదలో చిక్కుకుపోయారు. కలెక్టర్ అభిలాషఅభినవ్, ఎస్పీ జానకి షర్మిలఇద్దరు డ్రోన్ల సహాయంతో పశువుల కాపరి శంకర్ గుర్తించారు. అనంతరం ఎన్డీఆర్ ఎఫ్ బృందాలు బోటు సహాయంతో శంకర్ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో ఆయనకుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు వైద్య పరీక్షల, చికిత్స కోసం బాధితుడిని నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

# కాంగ్రెస్ పాలనంటే సెటిల్‌మెంట్లు, రియల్ ఎస్టేట్, కమీషన్లు

- రైతులు యూరియా కోసం రోడ్డెక్కినా పట్టింపులేని ప్రభుత్వమిది
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. అందరి లెక్కలు తేలుస్తాం
- కేటీఆర్ పర్యటనను విజయవంతం చేద్దాం

-బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, తాతా మధుసూదనరావు పిలుపు






**కొత్తగూడెం, తెలంగాణ దిశ :** ఎన్నికల్లో అలవి కానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికలయ్యాక హామీలను తుంగలో తొక్కి రైతులు, కార్మికులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదనరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పదేళ్ల కాలంలో మాజీ సీఎం కేసీఆర్ రైతులకు కన్నీళ్లు రాకుండా కాపాడుకున్నారని, అన్నీ వర్గాల ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన చేసి కష్టాలను రూపుమాపారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అంటేనే ఒకరేమో సెటిల్‌మెంట్లు, మరొకరు రియల్ ఎస్టేట్, ఇంకొకరు కమీషన్లతో దండుకుంటూ పాలనను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్‌కు చెరో 8 మంది ఎంపీలను గెలిపిస్తే వారు ఏ ఒక్క రోజు కూడా రైతుల కష్టాలు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేంద్రం అడుగులకు మడుగులు ఒత్తుతున్నట్లు తెలిపారు. ఏ ఒక్క ఎంపీ కూడా తెలంగాణ ప్రజల కష్టాల గురించి ఒక్కనాడు కూడా నోరు మెదపలేదన్నారు. ప్రజలు ఛీ కొడుతున్నా ఇంకా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని, ఇంకా వారు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను ఇబ్బందులు పెట్టాలని, జైలులో వేయాలని జపం చేస్తున్నారే తప్పా పాలనపై దృష్టి సారించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులే పాలనపై పెదవి విరుస్తున్నారని ఎద్దేవా చేశారు. యూరియా కోసం రైతులు కష్టాలు పడుతుంటే ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే కూడా పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించి రైతుల కష్టాలు వినలేని దౌర్భాగ్య స్థితిలో పాలకులు ఉన్నారని మండిపడ్డారు.

స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలు మనవే..: స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన సర్వేలో మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందనే ఎన్నికలను ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. కోర్టు మొట్టికాయలు వేయడంతో ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఈ నెల 10, 11న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యక్రమం ఉ న్నందున నియోజకవర్గం వారీగా సమావేశాలు ఉంటాయని, ప్రతీ ఒక్కరూ తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పవచ్చన్నారు. రాష్ట్రమంతటా మెజారిటీ స్థానాలను, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెజారిటీ జడ్పీటీసీలను గెలిచి జిల్లా పరిషత్ లను గెలవబోతున్నామని వారి సర్వేలో వెల్లడైందన్నారు. ఇటీవల కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా గ్రామ స్థాయిలో ఒక్క కార్యకర్త కూడా వారి వెంట వెళ్లకపోవడం బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్ పైన ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి వారి రిజర్వేషన్ ప్రకారం టిక్కెట్లు కేటాయిస్తామని, ఎవరూ అధైర్య పడాల్సిన పని లేదన్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసే ఆశావాహులంతా తమ బయోడేటాను పార్టీ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ నాయక్, మెచ్చా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ భద్రాచలం ఇన్‌చార్జి మానె రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కాపు సీతాలక్ష్మీ, పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మరణించిన నాయకులకు సంతాపం: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మరణించిన అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేటకు చెందిన తూతా నాగమణి, వైరా నియోజకవర్గానికి చెందిన జడల వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి వారు చేసిన కార్యక్రమాలు, ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుని వారి సేవలను కొనియాడారు.

## హామీలను అమలు చేయని

# కాంగ్రెస్‌ను తరమికొట్టాలి


**కొల్లాపూర్, తెలంగాణ దిశ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనికాంగ్రెస్ పార్టీని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తరమికొట్టాలని బీజేపీ మండల అధ్యక్షులు కేతూరి నారాయణ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చేయి పార్టీ చేతులెత్తేసిందని ఆరోపించారు. కల్యాణ లక్ష్మి పథకంలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం హామీ ఏమైందని, పింఛన్ల రూ.2 వేల నుంచి రూ. 4వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనీయవద్దని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాల వల్ల పంటలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై కొల్లాపూర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ సందు రమేష్, మాజీ మండల అధ్యక్షులు సాయి కృష్ణ గౌడ్, జిల్లా కార్యదర్శి తిరుమల యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఒరే శేఖర్, మండల ఉపాధ్యక్షులు పాండు, సాయి ప్రకాష్, మండల కార్యదర్శి నరసింహ, మహిళా మోర్చా అధ్యక్షురాలు కల్పనా రెడ్డి, గడ్డం శ్రీరామ్, చందు, రమేష్, భీముడు, శ్రీరామ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


# పీ4 కిందకు 13 లక్షల కుటుంబాలు

**విజయవాడ,తెలంగాణ దిశ:**పీ4 కార్యక్రమాన్ని ప్రారంభిం చగా.. అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు."నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి.. అభివృద్ధి చెందాలి.. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్ట కుండా... బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అనుకున్నదే చేస్తారు.

దానిపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కు తగ్గరు. తనకు అనుకూలమైన మీడియా వ్యతిరేకించినా తాను మాత్రం అనుకున్న దారిలోనే ముందుకు వెళతారు. అందులో పీ4 పథకం పై ఆయన ముందుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఎవరేమనుకున్నా.. ఎవరేం చెప్పినా తన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. పేదరిక నిర్మూలన అంటే మొత్తం పేదరికం రూపుమాపడం కాదని, కనీసం వాళ్లు తమ కుటుంబాన్ని పోషించుకునే స్థోమతను కల్పించడమే తన ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇందుకోసం వెనక్కు తగ్గబోమని, పేదవాళ్ల కోసం మనసున్న వాళ్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పదే పదే పిలుపు నిస్తున్నారు.

గత ఉగాదికి పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి పేదల కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా ఎంపిక చేసుకుంటూ వెళు తున్నారు. తాను నియోజకవర్గాలను పర్యటించినప్పుడు కనీసం రెండు, మూడు బంగారు కుటుంబాలను గుర్తించే పనిగా పెట్టుకున్నారు



చంద్రబాబు నాయుడు. ఇప్పటికే ఈ పథకం కింద దాదాపు పదమూడు లక్షల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. అలాగే మార్గదర్శకులుగా ఉండేందుకు దాదాపు 1.40 లక్షల మంది ముందుకు రావడం కూడా పథకం విజయవంతమవుతుందన్న నమ్మకంతో ఉన్నారు.

వీరిలో ప్రవాసాంధ్రులతో పాటు పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు. సంపద సృష్టించడమంటే పేదల ఇళ్లల్లో వెలుగు నింపడమేనని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ పథకం వల్ల కొన్ని కుటుంబాలయినా కూడు, గుడ్డ, నివాసానికి ఇబ్బంది లేకుండా ఉ ండగలిగితే సగం విజయం సాధించినట్లేనని నమ్ముతున్నారు. ఎంతమందికి అవకాశాలు కల్పించామన్నది కాకుం డా వారు జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు కల్పించ డమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. దీనివల్ల పేదల కుటుంబాల్లో తొలుత మానసికంగా ధైర్యంవస్తుందని,

తర్వాత వారు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడమే కాకుండా పది మందికి ఉపయోగపడేలా తయారవుతారన్నది చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు తన సొంత మీడియాలో విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. పీ4 పథకం ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆయన బలంగా విశ్వస్తున్నారు. మరి ఈ పథకం సక్సెస్ అయితే మాత్రం చంద్రబాబు నాలుగో పర్యాయంలో నూతన పథకంతో జనంలోకి వెళ్లినట్లే అనుకోవాల్సి ఉంటుంది.ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురా బోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం. సంజీవని పేరుతో ప్రజారోగ్య పరిరరక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేం దుకు సంజీవని తెస్తున్నాం. ఇప్పటికే కుప్పంలో బిల్‌గేట్స్ ఫౌండేషనుతో డీజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తాం" అని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పీ4 అంటే?: రాష్ట్రంలోని పేద కుటుంబాలను గుర్తించి సాధికారతను కల్పించటమే పీ–4 ప్రోగ్రాం ఉద్దేశ్యం. సంపద అధికం గా ఉన్న ఫ్యామిలీలను మార్గదర్శులుగా ఉంటారు. వీరు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు సపోర్టుగా నిలబడే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.

## జిల్లా కేంద్రంలో ఫోటో భవన్ ఏర్పాటుకు సహకరిస్తా

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ కొరకు ఫోటో భవన్ ఏర్పాటుకు సహకరిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జిల్లాలోని గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని జయచంద్ర గార్డెన్స్ లో జరిగిన భూపాలపల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే కు పలువురు ఫోటోగ్రాఫర్లు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇటీవల చనిపోయిన పలువురు ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు మరియు వీడియో గ్రాఫర్ల కొరకు అవసరమైన ఫోటో భవన్ జిల్లా కేంద్రంలో నిర్మించడానికి తన వంతుగా సహకరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఫోటోగ్రాఫర్ల కుటుంబ సభ్యుల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుండి పెద్ద సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తు కొరకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది

**- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించిన ఎమ్మెల్యే**
**- మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే..**
**- వంటగదిలో ఆహార పదార్థాలను రుచి చూసిన ఎమ్మెల్యే..**



**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** విద్యార్థుల బంగారు భవిష్యత్తు కొరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మంజూరునగర్ లోని ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంట గదిలో విద్యార్థులకు పెట్టే ఆహార పదార్థాలను మీడియా మిత్రులతో కలిసి టేస్ట్ చూశారు. అనంతరం ఎమ్మెల్యే అన్ని తరగతి గదులను కలియ తిరుగుతూ విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించు కున్నారు. తరగతి గదుల్లో కూర్చోడానికి బెంచీలు కావాలని పలు వురు విద్యార్థులు అడిగారు.



అదేవిధంగా, తరగతి గదులకు కిటికీలు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు వర్షం నీరు తరగతి గదుల్లోకి వస్తుందని పలువురు విద్యార్థులు తెలిపారు. సీసీ రోడ్లు, బాత్రూమ్స్, డార్మెటరీ,డ్రైనేజీ, తరగతి గదిలోకి పాములు రావడం తదితర స మస్యలను విద్యార్థులు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను అట్టి సమస్యలను త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంత రం ఎమ్మెల్యే మీడియాతో మాట్లా డుతూ.. విద్యార్థుల బంగారు భవిష్య త్తు కొరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అన్ని వసతి గృహాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేతృ త్వంలోని ప్రజా ప్రభు త్వం విద్యార్థులకునాణ్యమైనవిద్యతోపాటు భోజ నాన్ని అందించేం దుకు కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగం గానే విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంటపలువురుప్రజా ప్రతిని ధులు, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు.

## లోతట్టు ప్రాంతాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

**జమ్మికుంట, తెలంగాణ దిశ :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు హౌసింగ్ బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, హరితనగర్,కృష్ణ కాలనీ ఆబాదీ జమ్మికుంట ప్రాంతాలలో మేనేజర్ జి రాజిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్లు మహేష్, సదానందం, ఈ ఈ శ్రీకాంత్‌లు పలు వార్డులలో తిరిగి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారని, ఉదయం నుండి తహసీ ల్దార్ వెంకటరమణ, పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ లతో కలిసి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్, మాట్లాడుతూ ముం దు జాగ్రత్త చర్యలుగా రాత్రి నుండి మున్సిపల్ శానిటేషన్ అధికారు లు, సిబ్బంది పని చేశారని, రాబోయే మరో రెండు రోజులు అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉ ందని ఆయన తెలిపారు. ముందుగానే శిథివస్థలో ఉన్న పలు ఇండ్లకు నోటీసులు ఇచ్చి కూల్చి వేశామని, మిగిలిన మరికొన్ని శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారు చుట్టాల ఇంటికి, సురక్షితమైన ప్రాంతాలకు తరలివెళ్ళాలని ఆయన సూచించారు. ఈ వర్షాల వల్ల అంటువ్యా ధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఫోగింగ్,



బ్లీచింగ్, లైన్ మిక్స్ చేశామని, గత 15-20 రోజుల క్రితం నీరు నిల్వఉన్న చోటగం ఫిష్, ఆయిల్ బాల్స్ వేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, ఇండ్లలో నీరు నిల్వ ఉన్న తొట్టిలో, కొబ్బరి బొండాలలో, టైర్లతో పాటు పలు వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దాని వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ వర్ష కాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆయన సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ అధికారులు, మున్సిపల్ జవాన్లు, పరిశుద్య కార్మికులు పలువురు ఉన్నారు....

## ఘనంగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలక్షన్ ప్రచారంలో వికలాంగులకు, చేయూత పెన్షన్ దారులకు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ పెంచాలని లేకుంటే ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకోవాలని ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జ్ మడిపల్లి శ్యాంబాబు మాదిగ ఎం ఆర్ పీ ఎస్, ఎం ఎస్ పీ రాష్ట్ర నాయకులు లు డిమాండ్ చేశారు. ఉదయం జయశంకర్ భూపాలపల్లి చౌరస్తాలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మాచర్ల వంశీకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో విహెచ్పిఎస్ 18వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జ్ మడిపల్లి శ్యాంబాబు మాదిగ ఎం ఆర్ పీ ఎస్,ఎం ఎస్ పీ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ లు జెండా ఆవిష్కరణ చేసి అనంతరం మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి ఎలక్షన్ ప్రచారంలో వికలాంగులు చేయూత పెన్షన్ దారులతో మాట్లాడుతూ ఈ నెల పెన్షన్ తీసుకుంటే మీకు వికలాంగులకు 4016 లు చేయూత పెన్షన్ దారులకు 2016 లు వస్తున్నాయి కానీ నన్ను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి మాకు అధికారం ఇస్తే వచ్చే నెల నుంచి వికలాంగులకు 4016 లు ఉన్న పెన్షన్ 6000 చేయూత పెన్షన్ దారులకు 4000 ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి నేటికీ 20 నెలలు గడుస్తున్న కానీ పెన్షన్ పెంచకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి కూటమి ప్రభుత్వం వికలాంగులకు 6000 భరోసా పెన్షన్ దారులకు 4000 ఇస్తుందని మరియు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి మేరకు కండరాల క్షీణత ఉన్న వికలాంగులకు 15000 రూపాయలు ఇస్తుందని తెలిపారు. లోటు బడ్జెట్ లో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ లో పెన్షన్ పెంచి ఇస్తుంటే మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో పెన్షన్ పెంచకుండా ఎమ్మెల్యేల జీతాలు మాత్రమే పెంచుకుంటూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ దారులను మోసం చేస్తోందని అన్నారు. భూపాలపల్లి జిల్లాలో ఉన్న వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పెన్షన్ పెంచడం కోసం జరుగుతున్న పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని మరియు సెప్టెంబర్ 9న పరేడ్ గ్రౌండ్ హైదరాబాదులో జరుగు వికలాంగుల చేయుట పెన్షన్ దారుల మహా గర్జనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ... ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ భూపాల్ పల్లి జిల్లా నాయకులు అంతడుపుల సురేష్ మాదిగ మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు మంద తిరుపతి మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిరపట్టి అశోక్ మాదిగ జిల్లా నాయకులు మంద కిరణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు దోర్నాల భరత్ మాదిగ ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రధాన కార్యదర్శి ఒంటెరి రాజేష్ మాదిగ ఎంఎస్పి టౌన్ ప్రధాన కార్యదర్శి మంచినీళ్ల వైకుంఠం మాదిగ ఒంటెరి సమ్మయ్య మాదిగ దోర్నాల నరేష్ మాదిగ ఒంటేరు నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి

**-లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**-మంథని మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**





**మంథని, తెలంగాణ దిశ:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఎరువుల చెక్ పోస్ట్, మంథని మున్సిపాలిటీకి సంబంధించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం ఏక్లాస్ పూర్ గ్రామంలో ఎంపిక చేసిన స్థలాన్ని, మంథని పట్టణ హెడ్ క్వార్టర్ లో ఉన్న పుష్కర ఘాట్ ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం మంథని పురపాలక కార్యాల యంలో అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అడవి సోమన పల్లి గ్రామంలో 223 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కాగా 193 బేస్మెంట్, 90 గోడల స్థాయి, 60 స్లాబ్ దశలో ఉన్నాయని తెలిపారు. చివరి దశలో ఉన్న 50 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యూరియా చెక్ పోస్ట్ వద్ద 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని,సిబ్బంది షిఫ్ట్ పద్ధతిలో నియమించాలని, అక్రమ యూరియా రవాణా ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అన్నారు. మంథని మున్సిపాలిటీ సంబంధించి ఏక్లాస్ పూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ లో సేగ్రిగేషన్ షెడ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు. గోదావరి నదిలో భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వివిధ ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న అవుట్ ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైతే లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.

మంథని పట్టణంలో చేపట్టిన మున్సిపల్ భవనం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.పట్టణంలో ఆస్తి పన్ను వసూలు ఇంప్రూవ్ చేసుకోవాలని, వాణిజ్య వ్యాపార సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ ఫీజులు 100 శాతం వసూలు చేయాలని అన్నారు. పట్టణంలో అనుమ తులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు జరిగిన వెంటనే కూల్చి వేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉ ండాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకన్న, రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, తహసిల్దార్ కుమార స్వామి, ఎంపిడిఓ శశి కళ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# పర్పుల్ కలర్ క్యాబేజీని తింటే ఇన్ని లాభాలు ఉన్నాయా..?



క్యాబేజీని సాధారణంగా చాలా మంది అంత ఇష్టంగా తినరు. దీని నుంచి వచ్చే వాసన కొందరిలో వికారాన్ని కలగజేస్తుంది. కనుక క్యాబేజీ అంటే పెద్దగా ఇష్టపడరు. కొందరు దీంతో వేపుడు, పప్పు, పచ్చడి చేసుకుంటారు. అయితే క్యాబేజీలో ఎన్నో రకాలు ఉన్నాయి. వాటిల్లో ఆకుపచ్చ క్యాబేజీ, పర్పుల్ క్యాబేజీలను మనం ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా చాలా మంది ఆకుపచ్చ క్యాబేజీ తింటారు. కానీ పర్పుల్ కలర్ క్యాబేజీని తినడం వల్ల కూడా ఎన్నో లాభాలను పొందవచ్చు. పర్పుల్ కలర్ క్యాబేజీని రెడ్ క్యాబేజీ అని కూడా పిలుస్తారు. ఇది బ్రస్సికా జాతికి చెందినది. బ్రోకలీ, కాలిఫ్లవర్ లు కూడా ఇదే జాతికి చెందుతాయి. పర్పుల్ కలర్ క్యాబేజీలో అధిక మొత్తంలో ఆంథో సయనిన్స్ అని పిలవబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందువల్లే పర్పుల్ కలర్ క్యాబేజీ ఆ రంగులో ఉంటుంది. ఇక దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

**గుండె జబ్బులు రాకుండా..:** పర్పుల్ కలర్ క్యాబేజీని పోషకాలకు గనిగా చెప్పవచ్చు. అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. ఆంథోసయనిన్స్ ఇందులో అధిక మొత్తంలో ఉంటాయి. ఇది ఫ్లేవనాయిడ్స్ జాతికి చెందుతుంది. మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ రాకుండా చూస్తుంది. ఈ క్యాబేజీలో విటమిన్ సి, కెరోటినాయిడ్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. పర్పుల్ కలర్ క్యాబేజీని రోజుకు ఒక కప్పు మోతాదులో తింటే మనకు రోజుకు కావల్సిన

### రోజూ కచ్చితంగా తినాల్సిందే.. ఎందుకంటే..?

విటమిన్ సి దాదాపుగా లభిస్తుంది. విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. కొల్లాజెన్ ఉత్పత్తి అవుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

**జీర్ణ వ్యవస్థకు..:** ఈ క్యాబేజీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. పర్పుల్ రంగు క్యాబేజీలో ఉండే ఆంథో సయనిన్స్ కారణంగా బీపీ నియంత్రణలో ఉంటుంది. రక్తనాళాల వాపులు తగ్గిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్యాబేజీలో ఉండే పొటాషియం బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ క్యాబేజీలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల గుండె జబ్బులు, ఆర్థరైటిస్ రాకుండా చూస్తుంది. ఇందులో ఉండే అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ సమ్మేళనాలు శరీరంలో అంతర్గతంగా, బాహ్యంగా ఉండే వాపులను తగ్గిస్తాయి.

**ఎలా తినాలి..?:** పర్పుల్ రంగు క్యాబేజీలో విటమిన్ కె, క్యాల్షియం, మెగ్నిషియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్ రాకుండా చూస్తాయి. ఈ క్యాబేజీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర సమ్మేళనాలు క్యాన్సర్ రాకుండా చూస్తాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఇక పర్పుల్ రంగు క్యాబేజీని ఉడికించాల్సిన పనిలేదు. నేరుగా అలాగే తినవచ్చు. కానీ బాగా శుభ్రం చేసి తినాలి. దీన్ని నేరుగా తినలేమని అనుకుంటే తురుం లాగా పట్టి సలాడ్స్, ఇతర ఆహారాల్లో కలిపి తినవచ్చు. పచ్చిగా తినలేమని అనుకునేవారు ఈ క్యాబేజీతో సూప్ తయారు చేసి తాగవచ్చు. లేదా పెనంపై కాస్త వేయించి తినవచ్చు. ఈ విధంగా పర్పుల్ రంగు క్యాబేజీని తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# దారి తప్పుతున్న ధర్మవరం




**అనంతపురం, తెలంగాణ దిశ :** ధర్మవరం నియోజకవర్గం ఎన్నికలు జరుగుతున్న దగ్గర నుంచి నిత్యం వార్తల్లోనే నిలుస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య పొసగడం లేదు. అలాగే టీడీపీ నేతలు కూడా గ్రూపులుగా విడిపోయి వీధుల్లోకి దిగుతుండటం మంత్రికి తలనొప్పిగా మారింది. ధర్మవరం నియోజకవర్గంలో కూటమి పార్టీల్లో సఖ్యత లేకపోవడంతో పాటు నియోజకవర్గం టీడీపీలో గ్రూపు తగాదాలు రచ్చ రేపుతున్నాయి. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి 2019 ఎన్నికల తర్వాత టీడీపీని వీడి బీజేపీలో వెళ్లడంతో అక్కడ ఇన్ ఛార్జి బాధ్యతలను పరిటాల శ్రీరామ్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పగించారు. అయితే మొన్నటి ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గం కూటమి పార్టీల్లో పొత్తులో భాగంగా బీజేపీకి వెళ్లిపోయింది. సత్యకుమార్ యాదవ్ బీజేపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి నియోజకవర్గంలో ఏదో ఒక విషయంలో విభేదాలు కూటమి నేతల మధ్య తలెత్తుతూనే ఉన్నాయి. మొన్నటి వరకూ సత్యకుమార్ మాత్రం వైసీపీ స్థానిక నేతలను దగ్గరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. టీడీపీ, జనసేన కంటే వైసీపీ నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నేతలు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డికి అనకూలంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ధర్మవరానికి సత్యకుమార్ తీసుకురావడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి ఆవివాదం సద్దుమణిగిందని భావించిన సమయంలో మరొక వివాదం చుట్టుముట్టింది. మరోసారి మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నేతలలో గ్రూప్ వార్ మొదలయింది. ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య యుద్ధం మొదలయింది. బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి వద్ద ఘటన జరిగింది. టీడీపీ నేతలు విశ్వనాథ నాయుడు, గంటాపురం జగ్గు వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. బొగ్గు వ్యాపారుల నుంచి కమిషన్ల కోసం పరిటాల వర్గీయుల మధ్య ఆధిపత్యపోరు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరస్పరం ఇనుపరాడ్లు, కర్రలతో పరిటాల శ్రీరామ్ అనుచరులు దాడి చేసుకున్నారని చెబుతన్నారు. ఇరువర్గాల దాడిలో రెండు వాహనాలు ధ్వంసం కాగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు పోలీసుల ప్రయత్నం చేశారు. సోషల్ మీడియాలో టీడీపీ నేతల ఫైట్ దృశ్యాలు వైరల్ కావడంతో సైకిల్ పార్టీలో విభేదాలు రోడ్డుకెక్కాయి.

# అడ్డూ, అదుపులేని అక్రమాలు..?!

**మెదక్, తెలంగాణ దిశ :** మాకు అధికారుల అండదండ లున్నాయి.. మేం ఏదనుకుంటే అది చేయగలం.. ఏ భూమిని కబ్జా చేయలన్నా చేస్తాం.. ఎక్కడ ఏ నిర్మాణం చేపట్టాలన్నా చేపడతాం.. రహదారులు అడ్డొచ్చినా, గ్రామస్తులకు అభ్యంతరాలున్నా లెక్కలేదు.. మాకు ఎవరి అనుమతులు అవస రం లేదు..' అన్నట్లు అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ వైఖరి ఉందని సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపలి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో రేడియల్ రోడ్డు నంబర్-7కి ఇరువైపులా సంస్థ 2.5 కి.మీ పొడవు, 15 అడుగుల ఎత్తున కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నదని, రెవెన్యూశాఖ, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖల కనుసన్నల్లోనే ఈ నిర్మాణం జరుగుతున్నదని చెప్తున్నారు. ఈ విషయంలో గ్రామస్తులు తహసీ ల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, పైగా బడా సంస్థకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామస్తులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై స్పందించిన న్యాయస్థానం సంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు, ఆర్డీవోలు, రామ చంద్రాపురం తహసీల్దార్, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులకు నోటీసులు జారీచేసింది. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న కాం పౌండ్ వాల్‌పై స్థానికులు తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అక్రమంగా రేడియల్ రోడ్డు నంబర్- 7కి ఇరువైపులా దాదాపు 2 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నదని చెప్తున్నారు. కొల్లూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి కొండకల్ వైపునకు వెళ్లే ఈ రేడియల్ మార్గంలోనే ఈ గ్రామం ఉంది.

గ్రామ శివారులోని రైల్వేస్టేషన్ నుంచి 2 కిలోమీటర్ల మేర వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అది కూడా అవతలేం జరుగుతుందో చూడలేనంత ఎత్తులో వాల్ నిర్మించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీస సమాచారం కూడా, వాల్ నిర్మించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాల్‌ను ఎవరు నిర్మిస్తున్నారో? ఎందుకు నిర్మిస్తున్నారో.. ? తెలియడం లేదని, అధికారులను ఈ విషయంలో ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని వాపోతున్నారు. కాంపౌండ్ వాల్ విషయమై రామచంద్రాపురం రెవెన్యూ అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఓసారి రైల్వేశాఖ వాల్ నిర్మిస్తోందని, మరోసారి ఆర్అండ్‌బీ నిర్మిస్తున్నారని.. పూటకో మాట చెప్తున్నారని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. రేడియల్ రోడ్డుకు రెండువైపులా ప్రభుత్వ స్థలం ఉండగా, కొంత రైల్వే ఆధీనంలో ఉన్న భూమి కూడా ఉంది. కాగా నాగులపల్లి, కొండకల్ శివారులో అపర్ణ సంస్థ వందల ఎకరాలు సేకరించగా పొజిషన్ విషయంలో అనేక సమ స్యలు తలెత్తాయి. దీంతో సంస్థ భారీ కాంపౌం డ్ వాల్ నిర్మాణానికి పూనుకున్నదని తెలుస్తున్నది. అక్రమంగా వాల్ నిర్మిస్తున్నా యంత్రాం గం చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నదని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ విషయంలో గ్రామస్తులు తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేశారు. అయి నా, రెవెన్యూశాఖ ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. వాల్ నిర్మాణం ఇప్పటికే పూర్తి కావొచ్చిందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలోనూ గోడల నిర్మాణం జరుగుతున్నదని, అపర్ణ సంస్థ పేరును కూడా ప్రస్తావించి గ్రామస్తులు ఫిర్యాదు చేయడం గమనార్హం. అక్రమ వాల్ నిర్మాణంపై కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, అయినా స్పందన లేదని చెప్తున్నారు. గ్రామంలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్‌పై గ్రామస్తులు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. ఎక్కడికి వెళ్లినా, వారికి న్యాయం జరగకపోవడంతో ఇటీవల వారు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో హైకోర్టు సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, రామచం ద్రాపురం తహసీల్దార్, ఆర్అండ్‌బీ, రైల్వేశాఖ, పంచాయతీ శాఖలకు నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ, అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోయింది. ఈ విషయంలో స్థానిక తహసీల్దార్ నుంచి మొదలుకొని ఆర్డీవో, జిల్లా అధికారుల వరకు అపర్ణ సంస్థకు సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# పాఠశాల వాష్‌రూమ్‌లో బిడ్డకు జన్మనిచ్చిన తొమ్మిదో తరగతి విద్యార్థిని

కర్ణాటక లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పాఠశాల వాష్‌రూమ్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన యాద్గిర్ జిల్లాలో మధ్యాహ్నం చోటు చేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాద్గిర్ జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో వాష్‌రూమ్ లోపల తొమ్మితో తరగతి విద్యార్థిని మగబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక, నవజాత శిశువు ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు. వారు షాహాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై సుమోటోగా కేసు నమోదు చేశారు. అంతేకాదు ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# యాప్ లో అప్ లోడ్ చేస్తే రూ. 8100

**అదిలాబాద్, తెలంగాణ దిశ:** ఈ ఏడాది మీరు పత్తి సాగు చేస్తున్నారా..? అయితే మీరు ఈ విషయం తెలుసుకోవాల్సిందే. రైతులందరూ మద్దతు ధర అందుకునేందుకు? కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా? కపాస్ కిసాన్ అనే యాప్ తీసుకొచ్చింది. పత్తి వేసిన రైతులు.. వారు పేర్లను సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా ఎంట్రీ చేసుకున్న వారు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకోవచ్చు. ఈ మేరకు మార్కెటింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ యాప్ గురించి సమాచారం? దీన్ని మీరు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీకు తెలియకపోతే మీ పిల్లలను అడిగే చెబుతారు లేదా అధికారులను అయినా సంప్రదించచ్చు. ఆ తర్వాత యాప్‌లో ఆధార్ కార్డు, మీ భూమి రికార్డులు, పత్తి పంటకు సంబంధించి రెవిన్యూ శాఖ వారి ఇచ్చిన రికార్డును అప్‌లోడ్ చేయాలి. ఇలా చేయడం ద్వారా.. దేశవ్యాప్తంగా పత్తి రైతులు ఎందరున్నారు..? పత్తి పంట విస్తీర్ణం ఎంత అనే వివరాలు అన్నీ కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వద్ద రికార్డ్ అవుతాయి. మీకు మద్దతు ధర అందాలంటే.. వచ్చే నెలా ఆఖరులోపు యాప్‌లో రికార్డు చేయడం మార్చిపోవద్దు. ఈ ఏడాది పత్తికి కనీస




మద్దతు ధర రూ. 8,110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కపాస్? కిసాన్? యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు.. పత్తిని అమ్మే సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. మీరు పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లాలో యాప్ వివరాలు పంపుతుంది. ఈ పద్ధతి వల్ల రైతులకు నిరీక్షణ సమస్యలు ఉండవు. స్లాట్ బుక్ చేసుకుంటేనే సౌలభ్యాన్ని పొందవచ్చు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి నుంచి పత్తి పంట చేతికొస్తుంది. అయితే ఇటీవల కాలంలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో.. దిగుబడి పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

# నిండుకుండలా మానేరు

## మిడ్‌మానేరులోకి భారీగా వరదనీరు

**కరీంనగర్, తెలంగాణ దిశ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల, కరీంన గర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

ఈ మేరకు వాతావరణశాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ తెలిపింది. నేడు ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# సీనియర్లే బెటర్..



**కాకినాడ, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సీనియర్ నేతల విలువ తెలిసి వచ్చినట్లుంది. జూనియర్ ఎమ్మెల్యేలతో పడుతున్న అవస్థలు చూసి సీనియర్లే నయం అనిపించేలా చంద్రబాబు మాటలు ఉన్నాయి. గత కొంతకాలంగా ఎమ్మెల్యేలు వరస వివాదాలతో చిక్కుకోవడం తో పాటు అందులో ఎక్కువ మంది తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన వారు ఉండటంతో గతంలో లేని తలనొప్పులు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయన్న విషయం చంద్రబాబు కు అర్థమయినట్లుంది. అందుకే సీనియర్ నేతల విలువ ఆయనకు తెలిసిందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. సీనియర్ నేతలకు ఉన్న అనుభవంతో పాటు వారికి ప్రజల్లో ఉన్న పట్టు ఈతరం నేతలకు లేకపోవడానికి అనేక కారణాలున్నాయని చంద్రబాబు గుర్తించారు.. ఒకసారిఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాను నియోజకవర్గానికి మోనార్క్ అయిపోయినట్లు వ్యవహరిస్తూ తన విజయం కోసం పనిచేసిన పార్టీ కార్యకర్తలను పట్టించుకోకుండా నియోజకవర్గంలో అన్ని విషయాల్లో వేలుపెడుతూ వివాదాల్లో చిక్కుకోవడంతో పాటు ఇగోలకు పోవడంతో పాటు, సోషల్ మీడియాలో వారి వ్యవహార శైలి కూడా పార్టీకి ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యేలు కొందరు ప్రొటోకాల్ తెలుసుకోకుండానే అధికారులతో ఎమ్మెల్యేలు వాగ్వాదానికి దిగుతుండటాన్ని కూడా ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రస్తావిస్తున్నారు. అలాంటి వివాదాలను గతంలో సీనియర్ నేతలు ఎవరికీ రాకపోవడాన్ని కూడా గుర్తుంచుకోవాలంటున్నారు. కొత్తతరానికి అవకాశమివ్వాలని... పార్టీకి కొత్త రక్తం కావాలని యువతకు పెద్దపీట వేయాలని, కొత్తతరానికి రాజకీయాల్లో అవకాశం కల్పించాలని తాను నిర్ణయం తీసుకుంటే.. కూటమి కారణంగా గెలిచిన ఎమ్మెల్యేలు గెలుపు తమదేనని విర్రవీగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. ఇసుక, మద్యం విషయాల్లోనూ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే ల నియోజకవర్గాల్లోనే రచ్చకెక్కడాన్ని ఆయన గుర్తు చేసుకుంటున్నారు. పది కాలాల పాటు తాము ఆ నియోజకవర్గంలో గెలిచేందుకు అవసరమైన రోడ్ మ్యాప్ ను గెలిచిన రోజు నుంచి రూపొందించుకోవాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు ఇలా వ్యవహరించడంతో చంద్రబాబుకు తత్వం బోధపడిందని తెలిపింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పార్టీకి అండగా నిలబడకపోగా, విపక్షాల విమర్శలపై స్పందించకపోగా, వివాదాలబారిన పడుతుండటం చంద్రబాబును పునరాలోచనలో పడిందనే చెప్పాలి.

# సినిమా..

# రహమాన్ డప్పు.. రామ్ చరణ్ స్టెప్పు..




రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం పెద్ది. పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మూవీకి సంబంధించిన అప్‌డేట్స్ మెగా ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా కోసం క్రేజీ ట్యూన్స్‌ను సిద్ధం చేస్తుండగా, ఇవి మూవీపై అంచనాలు భారీగా పెంచుతున్నాయి. లెజెండరీ మ్యూజిషియన్ ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్స్ రెడీ చేస్తున్నారట. ఈ క్రమంలో పెద్ది పై ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. దర్శకుడు బుచ్చి బాబు సానా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఒక పవర్‌ఫుల్ స్పోర్ట్స్ డ్రామా గా రూపొందుతోంది. మేకింగ్ పరంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా నిర్మాణాన్ని మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ రోజు (ఆగస్ట్ 27) వినాయక చవితి సందర్భంగా మూవీ యూనిట్ నుండి ఓ భారీ అప్డేట్ వెలువడింది. సినిమాలోని ఓ మాస్ బీట్ సాంగ్‌కి సంబంధించిన షూటింగ్ నేడు ప్రారంభమైందని ప్రకటించారు. ఈ పాటకు సంగీతం అందించింది లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్. రెహమాన్. సమాచారం ప్రకారం, ఇది సినిమాలో ఓ హైలైట్ మాస్ నెంబర్‌గా నిలవనుందని టాక్. ఈ పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నాడు. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే ఈ పాట కోసం 1000 మంది డ్యాన్సర్లు పాల్గొంటున్నారు. ఈ గ్రాండ్ సెట్‌ను మైసూర్‌లో ఏర్పాటు చేశారు. దీంతో ఈ సాంగ్ విజువల్స్ స్క్రీన్ మీద విపరీతంగా ఆకట్టుకునేలా ఉండబోతున్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రామ్ చరణ్ %-% బుచ్చి బాబు కాంబో, రెహమాన్ మ్యూజిక్, జాన్వీ గ్లామర్, మాస్ బీట్ సాంగ్ తో మైత్రీ సంస్థ ఖాతాలో మరో విజయం చేరడం గ్యారెంటీ అని అంటున్నారు. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉంటుందన్న విషయం కన్ఫార్మ్ అయ్యింది. ఆ పాటలో స్టార్ హీరోయిన్ సమంత, రామ్ చరణ్ సరసన ఆడిపాడితారన్న టాక్ వినిపిస్తోంది.

# బ్లాక్ అండ్ వైట్ లుక్స్‌లో సామ్ మెస్మరైజ్..




సమంత రూత్ ప్రభు ప్రతి సారి తన స్టైల్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు కూడా అదే రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. బ్లాక్ అండ్ వైట్ గౌన్‌లో కూల్ లుక్‌తో కనిపించిన సమంత, సింపుల్‌గా ఉన్నా స్టైలిష్‌గా నిలిచింది. మేకప్ మినిమల్‌గా, హెయిర్ లూజ్‌గా వదిలేసుకోవడం ఈ లుక్‌ను మరింత సహజంగా చూపించింది. సమంత కెరీర్ గురించి చెప్పాలంటే, 2010లో ఏ మాయ చేసావే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత దూకుడు, ఈగ, అత్తారింటికి దారేది, రంగస్థలం వంటి బ్లాక్‌బస్టర్‌లతో స్టార్ హీరో యిన్‌గా ఎదిగిం ది. తెలుగుతో పాటు తమిళంలోనూ అగ్రశ్రేణి నటిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా ది ఫ్యామిలీ మాన్ 2 వెబ్ సిరీస్‌లో చేసిన పాత్ర ఆమెకు కొత్త గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇటీవలి కాలంలో ఆరోగ్య సమస్యల కారణంగా సినిమాలకు కొంత విరామం తీసుకున్నా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంటుంది. తన ప్రయాణం, వర్కౌట్ క్లిప్స్, వ్యక్తిగత ఆలోచనలను షేర్ చేస్తూ అభిమానులతో అనుబంధం కొనసాగిస్తోది. ఈ ఫోటోషూట్ కూడా ఆమె ఫ్యాషన్ సెన్స్, లైఫ్ స్టైల్‌పై ఉన్న క్లాస్‌ని మరోసారి చూపించింది. ఇక సమంత ప్రస్తుతం కొన్ని కీలక ప్రాజెక్ట్‌లలో నటిస్తోంది.

శాకుంతలం తర్వాత ఆమె చేసిన ప్రయోగాలు మిశ్రమ స్పందన తెచ్చుకున్నా, రాబోయే చిత్రాలపై ఇంకా మంచి అంచనాలున్నాయి. బాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లపై కూడా ఆమె దృష్టి పెట్టింది. నటనతో పాటు బ్యూటీ, ఫిట్‌నెస్‌ల లోనూ ఇన్స్పిరేషన్‌గా మారిన సమంత, అనేక మంది అభిమానులకి రోల్ మోడల్‌గా నిలుస్తోంది. మొత్తానికి, సమంత షేర్ చేసిన ఈ తాజా ఫోటోలు మరోసారి ఆమె లుక్‌ని హైలైట్ చేశాయి. ప్రస్తుతం ఆమె రక్త బ్రహ్మాండ అనే ప్రాజెక్టులో నటిస్తోంది.



# కాబోయే భర్తను సోషల్ మీడియాలో పరిచయం చేసిన నివేదా



ప్రముఖ టాలీవుడ్ నటి నివేదా పేతురాజ్ తన అభిమానులకు ఓ తీపి కబురు అందించారు. త్వరలోనే తాను వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కాబోయే భర్తను పరిచయం చేస్తూ, ఇప్పటికే తమ నిశ్చితార్థం కూడా జరిగిపోయిందని వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటో ప్రస్తుతం వైరల్ అవుతోంది. నివేదా పేతురాజ్ వివాహం చేసుకోబోయే వ్యక్తి పేరు రాజ్‌హిత్ ఇబ్రాన్. ఆయన ఒక వ్యాపారవేత్త అని సమాచారం. రాజ్‌హిత్ దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అనే ప్రచారం జరుగుతోంది. వీరి వివాహ వేడుక ఈ ఏడాది చివరి నాటికి జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ వేడుకను ఎలాంటి ఆడంబరాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా నిర్వహించాలని ఇరు కుటుంబాలు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

పెళ్లికి సంబంధించిన మరిన్ని అధికారిక వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి. నివేదా పెళ్లి వార్త తెలియగానే ఆమె అభిమానులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా కొత్త జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. చాలామంది ఆమెకాబోయే భర్త వివరాల కోసం ఆసక్తిగా వెతుకుతున్నారు. తమిళ చిత్రం'ఒరు నాల్ కూతు'తో నటిగా అరంగేట్రం చేసిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆతర్వాత 'అల వైకుంఠపురములో', 'చిత్రలహరి','బ్రోచేవారెవ రురా', 'దాస్ కా ధమ్కీ' వంటి విజయవంతమైన చిత్రాలలో నటించి తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

# నా కూతురు సినిమాల్లోకి రాదు: కాజోల్



బాలీవుడ్‌లోకి తన కూతురు నైసా దేవ్‌గణ్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందనే వార్తలపై క్లారిటీనిచ్చింది నటికాజోల్ దేవ్‌గణ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. చాలామంది స్టార్ కిడ్స్ మాదిరిగా నైసాకునటిగా మారే ఉద్దేశం లేదని కాజోల్ స్పష్టం చేసింది. "నా కూతురు సినీ రంగంలోకి రావడం లేదు. ఆమెకు ఇప్పుడు 22 ఏళ్లు, తన భవిష్యత్తుపై ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. ఆమె సినీ పరిశ్రమలో కాకుండా వేరే రంగంలోకి వెళ్లాలని అనుకుంటోంది" అని కాజోల్ వెల్లడించారు. అయితే ఈ వ్యాఖ్యలతో నైసా బాలీవుడ్‌లో అడుగుపెట్టబోతుందన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. అలాగే నెపో-బేబీ వివాదంపై కాజోల్ మాట్లాడుతూ.. మీరు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోజే తెలుసుకోవాల్సిన విషయం..

ఇక్కడ మంచి, చెడు రెండు ఉంటాయని. మీరు విమర్శలకు గురవుతారని మీరు అర్థం చేసుకోవాలి. కొన్ని విమర్శలు కఠినంగా, కొన్ని అసంబద్ధంగా, భయం కరంగా ఉంటాయి. అయితే ఇవి తట్టుకుని నిలబడితేనే మీరు ఇండస్ట్రీలో రాణిస్తారు. ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఇలాంటివి ఎదుర్కోవాలి. వారికి తప్పించుకునే ఛాయిస్ ఉండదంటూ కాజోల్ చెప్పుకొచ్చింది. అయితే నైసా వేరే కెరీర్‌ను ఎంచుకున్నప్పటికీ ఈ ఏడాది పలువురు స్టార్ కిడ్స్ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ, కాజోల్ మేనల్లుడు ఆమన్ దేవగన్, సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ 2025లో అరంగేట్రం చేశారు. ఇక, శనయ కపూర్ విక్రాంత్ మాస్సే సరసన తన ఎంట్రీని ఇవ్వగా, అహాన్ పాండే తన బ్లాక్‌బస్టర్ డెబ్యూ 'సైయారా'తో అందరి దృష్టిని ఆకర్షించారు.

# అంచనాలు తలకిందులు.. భారీ నష్టాల్లో వార్ 2




యంగ్ టైగర్ ఎన్టీఆర్ బాలీవుడ్‌లో అడుగుపెట్టిన 'వార్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారీ అంచనాలతో విడుదలైన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్, ప్రేక్షకులను ఆకట్టుకోలేక చతికిలపడింది. రూ. 400 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, యశ్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్‌ఎఫ్) స్పైవర్స్‌లో ఒక మరపురాని చిత్రంగా నిలుస్తుందని భావించినా తీవ్ర నిరాశను మిగిల్చిందని సమాచారం. దక్షిణాదిలో మార్కెట్‌ను విస్తరించే లక్ష్యంతో ఎన్టీఆర్ లాంటి స్టార్‌ను ఈ ప్రాజెక్టులోకి తీసుకున్నప్పటికీ, సినిమా అన్ని ప్రాంతాల్లోనూ తిరస్కరణకు గురైనట్టు వార్తలు వస్తున్నా యి. వైఆర్‌ఎఫ్ స్పైవర్స్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన 'పఠాన్' (ప్రపంచ వ్యాప్తంగా రూ. 1050 కోట్లు) రికార్డును బద్దలు కొట్టడం అటుంచి, కనీసం దాని దరిదాపుల్లోకి కూడా వెళ్లలేకపోయింది.

రెండు వారాలు గడిచినా ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్ల మార్కును కూడా అందుకోలేకపోయింది. అంతేకాదు, 2019లో సంచలన విజయం సాధించిన మొదటి భాగం 'వార్' (ప్రపంచవ్యాప్తంగా రూ. 471 కోట్లు) వసూళ్లను కూడా అధిగమించలేకపోయింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా నిలుస్తుందన్న అంచనాలను కూడా 'వార్ 2' తలకిందులు చేసింది.

విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 805 కోట్లకు పైగా వసూలు చేయగా, 'వార్ 2' దాని దరిదాపుల్లోకి కూడా వెళ్లలేకపోయింది. 'వార్', 'పఠాన్' వంటి బ్లాక్‌బస్టర్లు అందించిన సిద్ధార్థ్ ఆనంద్ స్థానంలో దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన అయాన్ ముఖర్జీ ఈ స్పై థ్రిల్లర్‌ను ఆసక్తికరంగా మలచడంలో విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో,అయాన్‌కు ఇప్పటికీ 'బ్రహ్మాస్త్ర' (ప్రపంచ వ్యాప్తంగా రూ. 431 కోట్లు) చిత్రమే అతిపెద్ద హిట్‌గా మిగిలిపోయింది. మొత్తం మీద, భారీ తారాగణం, బడ్జెట్ ఉన్నప్పటికీ, కథాకథనాలు బలహీనంగా ఉండటంతో 'వార్ 2' నిర్మాణ సంస్థకు ఒక భారీ డిజాస్టర్‌గా నిలిచిందనే భావిస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215